సాక్షి 24|7

విజయనగరం

ఆదివారం 27-8-2017

గజానన మహర్నిశం...



జిల్లా వ్యాప్తంగా గణపతినవరాత్రి ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. విభిన్న రూపాల్లో ప్రతిష్టించిన వినాయకుడి విగ్రహాలు అందరినీ అలరిస్తున్నాయి. బొబ్బిలిలో 52 కిలోల పసుపుకొమ్ములతో రూపుదిద్దుకున్న గణపతి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నెల్లిమర్లకు చెందిన నలుగురు కళాకారులు 36రోజులపాటు కష్టపడి ఈ విగ్రహాన్ని రూపొందించారు.

- బొబ్బిలి రూరల్



- జిల్లాలో పెరుగుతున్న సినిమా షూటింగ్‌లు
- అనుకూలంగా ప్రదేశాలు, అందుబాటులో ఆర్టిస్టులు
- స్థానిక కళాకారులకు పెరుగుతున్న అవకాశాలు
- ఇంకాస్త మెరుగుపడితే ఇక్కడి వారికి పండుగే
- చిత్ర విజయానికి జిల్లాలో షూటింగ్ ఓ సెంటిమెంట్

వెండితెరపై విజయ వెలుగులు

చిత్రపరిశ్రమతో... విజయనగరానిది విడదీయరాని బంధం. ఇక్కడినుంచి ఎందరో కళాకారులు సినీ వినీలాకాశంలో ధ్రువతారలుగా నిలిచారు. ఇప్పటికీ వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. అంతేనా... టాలెంట్ ఉన్నా గుర్తింపు లేక స్థానికంగానే షార్ట్‌ఫిల్మ్‌లతో ఆ కళాతృష్ణ తీర్చుకుంటున్నారు. జిల్లాలోని పరిసరాలూ షూటింగ్ స్పాట్‌లుగా సెల్యులాయిడ్‌పై చెరగని ముద్ర వేశాయి. రెండు రెళ్ల ఆరు... శుభసంకల్పం... బంగారు కానుక... గూండా... జంబలకిడి పంబ... నరసింహనాయుడు... ఒకటేమిటి ఎన్నో సినిమాల చిత్రీకరణకు మన జిల్లా వేదికగా నిలిచింది. మధ్యలో కాస్తంత గ్యాప్ వచ్చినా... ఇప్పుడిప్పుడే ఇక్కడ మళ్లీ షూటింగ్‌లు ఊపందుకున్నాయి.



తాటిపూడి పరిసరాల్లో నిర్వహించిన షూటింగ్(ఫైల్)

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

విజయనగరంలో సినీ కాంతులు ప్రకాశిస్తున్నాయి. షార్ట్ ఫిల్మ్‌ల నుంచి ఫీచర్ ఫిల్మ్‌ల వరకూ ఏ సినిమా షూటింగ్‌కైనా ఇటీవలి కాలంవరకూ హైదరాబాద్, విశాఖలనే ఎంచుకునేవారు. ఇప్పుడు జిల్లా పై అందరి దృష్టి పడింది. ఇటీవల కాలం లో పెద్ద పెద్ద సినిమాలు సైతం ఇక్కడి లొకేషన్లలోనే షూటింగ్‌లు జరుపుకుంటున్నాయి. ఎన్నో ఏళ్లుగా టాలెంట్ ఉండి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్న ఆర్టిస్టులకు తాజా పరిణామాలతో అవకాశాలు లభిస్తున్నాయి. అయితే ఆర్థికంగా తోడ్పాటు నందించడంతో పాటు సినిమాకు సంబంధించి అన్ని శాఖలకు స్థానికులనే

- మిగతా 2వపేజీలో ▶

మాయదారి పిడుగులు ప్రాణాలు తోడేస్తున్నాయి. వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన వారిపై పగబడుతున్నాయి. ఒకరు కాదు... ఇద్దరు కాదు... గడచిన పదిరోజుల్లో ఏడుగురిని బలిగొన్నాయి. శనివారం ఒక్క రోజే ముగ్గుర్ని పొట్టన బెట్టుకున్నాయి. పొలం పనులంటేనే భయపడే పరిస్థితి తీసుకొస్తున్నాయి. వానలు పడక అవస్థలు పడితే... ఏదో చిన్నపాటి జల్లులు కురుస్తున్నాయని సంబరపడుతున్నారు. వాటితో పంట బతికించుకుందామంటే అదే సమయంలో పడే పిడుగులకు బలైపోతున్నారు.



దాలమ్మ మృత దేహాన్ని పంటపొలంలోంచి మోసుకొస్తున్న రైతులు



కలగాడలో పిడుగుపాటుకు మృతి చెందిన సన్యాసి నాయుడు, పాడిగేదె

బడుగులపై పిడుగు

- పిడుగుపాటుకు ముగ్గురు బలి
- రైతుకూలీలపై ప్రకృతి కన్నెర్ర
- ఒకే రోజు ముగ్గురి మృతి
- గడచిన పది రోజుల్లో ఏడుగురి మృతి
- బెంబేలెత్తిపోతున్న రైతులు

లక్కవరపుకోట/జామి: జిల్లాలో శనివారం పిడుగుపాటుకు ము గ్గురు మృతి చెందారు. మధ్యాహ్నం కురిసిన వర్షానికి ఉరుములు, పిడుగులు తోడవుతున్నాయి. లక్కవరపుకోట మండలం ఖాసాపేటకు చెందిన

- మిగతా 2వపేజీలో ▶

బడుగులపై పిడుగు

▶ మొదటి పేజీ తరువాయి



ఎర్నాయుడు మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, కుమార్తె, (ఇన్‌సెట్లో) ఎర్నాయుడు (ఫైల్‌ఫొటో)

బాడితబోని ఎర్నాయుడు(48) పొలం పనులు చేసుకుంటుండగా పిడుగు పడి మృత్యువాత పడగా, కూర్మవరం గ్రామానికి చెందిన కెల్లి దాలమ్మ(55) వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన పిల్లలకు భోజనం తీసుకెళ్లి తిరిగి వస్తుండగా పిడుగుపడి అక్కడికక్కడే కన్నుమూసింది. ఇక జామి మండలం కలగాడ గ్రామానికి చెందిన బాదిరెడ్డి సన్యాసినాయుడు (52) గేదెలు తోలుకుని పొలానికి వెళ్లి మేపిస్తుండగా పిడుగుపాటుకు గురయ్యాడు. ఈ సంఘటనలతో ఆ మూడు కుటుంబాల్లో విషాదం అలముకుంది. ఖాసాపేట గ్రామం సమీపంలో గల కోమటి పొలంలో ఎర్నాయుడు దమ్ముపనులు చేస్తుండగా ఒక్కసారిగా ఆకాశం మబ్బు పెట్టి పెద్ద ఉరుములతో పిడుగులు పడ్డాయని చెంతనే వున్న రైతులు తెలిపారు. ఎర్నాయుడుపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తోటి రైతులు ఆయన మృతదేహాన్ని గ్రామంలోకి తరలించారు. మృతునికి భార్య దేముడమ్మ, తిరుముల, నాగమణి, సాయి అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఎర్నాయుడు కూలి పనులు చేస్తూ భార్య పిల్లలను పోషిస్తున్నాడు. రంగాపురం పంచాయతీ శివారు కూర్మవరం గ్రామానికి చెందిన కెల్లి దాలమ్మ(55) గ్రామానికి సమీపంలో చవిటిబంద పొలంలో పనులు చేస్తున్న కుటుంబ సభ్యులకు మధ్యాహ్న భోజనాలు తీసుకెళ్లి తిరిగి వస్తుండగా పిడుగుపాటుకు గురై పొలం గట్టుపైనే మృత్యువాత చెందింది. ఆమెకు ఇద్దరు కుమారులున్నారు.

గేదెల్ని మేపిస్తుండగా...

జామి మండలం కలగాడ గ్రామానికి సమీపంలోని అక్కునాయుడు చెరువువద్దగల పొలంలో మేపించాలని బాదిరెడ్డి సన్యాసినాయుడు గేదెల్ని తోలుకువెళ్లాడు. సాయంత్రం 4గంటల సమయంలో వర్షం పడి పిడుగుపడడంతో సన్యాసినాయుడు అక్కడికక్కడే మృతిచెందాడు. అతను తీసుకెళ్లిన ఒక పాడి గేదె కూడా మృతి చెందింది. పక్కనే పొలంలో ఉభాలు వేస్తున్నవారంతా ఈ ఘటనకు ఉలిక్కిపడ్డారు. గ్రామస్తులు రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం అందించారు. సన్యాసినాయుడుకు భార్య సన్యాసమ్మ, ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహాలు కాగా కుమారుడు ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు.

ముందుగానే హెచ్చరిస్తున్నా...

- జిల్లాలో పెరుగుతున్న పిడుగుపాటు మృతులు
- అక్కరకు రాని సాంకేతిక పరిజ్ఞానం
- ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలం

విజయనగరం గంటస్తంభం:

జిల్లాలో వరుసగా పిడుగుపాటుకు ప్రాణాలు పోతున్నాయి. రెండు రోజుల క్రితం జిల్లాలో వేర్వేరు చోట్ల నలుగురు... శనివారం ఒక్కరోజే ముగ్గురు పిడుగుపాటువల్ల ప్రాణాలు కోల్పోయారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 11మంది జిల్లాలో మృతి చెందారు. గతేడాది 14మంది మృతి చెందడం గమనార్హం. అంతకుముందు సంవత్సరాలతో పోల్చి చూస్తే ఈ సంఖ్య ఎక్కువనే చెప్పాలి. గతేడాది 14మంది మృతి చెందితే... ఈ ఏడాది ఇప్పటికే 10మంది మృతి చెందడం, ఇంకా వర్షాలు పడే కాలం చాలా ఉండడంతో ఈ సంఖ్య ఎంతకు పెరుగుతుందన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.


సాంకేతికత పెరుగుతున్నా...

మానవుడు సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన విషయం విదితమే. వాస్తవానికి పిడుగులు ఎప్పుడు, ఎక్కడ పడతాయో ఒకప్పుడు తెలిసేవి కావు. దద్దరిల్లే ఉరుములు, మెరుపులు ఉన్నచోట కూడా పిడుగులు పడేవి కాదు. ఒక్కోచోట ఒకే గర్జనకు పిడుగుపడేది. కానీ గత రెండేళ్లుగా ఈ విషయంలో సాంకేతికత ఎంతో అభివృద్ధి చెందింది. వర్షం పడుతుందో లేదో వాతావరణశాఖ కచ్చితంగా ఇప్పటికీ చెప్పలేకపోతున్నా పిడుగులు ఎప్పుడు, ఎక్కడ పడతాయో విపత్తుల నిర్వహణ శాఖ ముందే చెప్పేస్తోంది.

ఈ విధంగా ఆ విభాగం అధికారులు జిల్లాకు సంబంధించి చేసిన హెచ్చరికలన్నీ నిజమయ్యాయి. పడతాయన్న చోట పడ్డాయి. అయినా మరణాల నుంచి జనం తప్పించుకోలేకపోవడం ఆశ్చర్యకరం. అంతేగాకుండా ఎక్కువ మరణాలు సంభవిస్తుండడం బాధాకరమైన అంశం.

సమాచారం చేరడంలో లోపమే

పిడుగు ఎప్పుడు ఎక్కడ పడుతుందో తెలుసుకునే సాంకేతికత అభివృద్ధి చెందినా ఆ ప్రాంతానికి ఆ సమాచారం చేరవేసే యంత్రాంగం విస్తరించకపోవడం ఇప్పుడు మరణాలకు కారణంగా నిపుణులు భావిస్తున్నారు. పిడుగుపడే సమయం, ప్రదేశం దాదాపుగా విపత్తుల నిర్వహణ శాఖ నుంచి జిల్లా విభాగానికి వస్తోంది. అక్కడి నుంచి వారు మండల తహసీల్దార్లను అప్రమత్తం చేస్తున్నారు. అదే సమయంలో వారు గ్రామాల్లో ఉండే వీఆర్వో, వీఆర్యే, ఇతర అధికారులను అప్రమత్తం చేసి ప్రజలకు హెచ్చరికలు పంపాలి. అంతేకాదు పిడుగులు ఎలాంటి సమయంలో పడతాయో వారికి అవగాహన కల్పించాలి. ఈ రెండు విషయాల్లో అధికారులు విఫలమవుతున్నాని చెప్పక తప్పదు. గ్రామస్థాయిలో ఉండే వీఆర్వోలు స్థానికంగా ఉండకపోవడం, వీఆర్యేలను కూడా స్థానికేతరులను నియమించడంతో వారి సేవలు అందుబాటులో ఉండటంలేదు. అందువల్ల పిడుగులు పడతాయన్న విపత్తుల నిర్వహణ శాఖ అధికారుల ఆదేశాలు ప్రజలకు చేరకపోవడంవల్ల పొలాల్లో జనం ప్రాణాలు వదిలేయాల్సి వస్తోంది. ఇప్పటికైనా గ్రామాల్లో వ్యవస్థను మెరుగుపరుచుకుంటే ప్రాణాలకు ముప్పు తగ్గుతుంది. అయితే అధికారుల వాదన ఇంకోలా ఉంది. తాము సమాచారం గ్రామంలో చెబుతున్నా వారు పెడచెవిన పెడుతున్నారని చెబుతున్నారు.



పిడుగుపాటుకు కాలుతున్న తాటిచెట్టు

వెండితెరపై 'విజయ'వెలుగులు

▶ మొదటి పేజీ తరువాయి

వినియోగించుకుంటే కళాకారుల కలలు పూర్తిగా నెరవేరినట్టే. విజయనగరంలోనే కాకుండా రూరల్ పరిధిలోని మారుమూల గ్రామాల్లోనూ ఆర్టిస్టలు చాలా మంది ఉన్నారు.

ఇప్పుడిప్పుడే పరిస్థితుల్లో మార్పులు

విజయనగరం నుంచి ఎందరో మహామహులు సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టి కీర్తి ప్రతిష్టలు గడించారు. అంతే స్థాయిలో చిన్న వాళ్లు ఉన్నారు. ఏడాదిలో ఓ పది సినిమా షూటింగ్‌లు జరిగితే వాటిలో ఒక్కదానిలోనైనా తమకు చిన్న అవకాశమైనా దొరకకపోతుందా అని ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తూనే ఉన్నారు. పూర్వం విశాఖలో ఒక్క సన్నివేశాన్నైనా చిత్రీకరించకుండా చిత్రం పూర్తయ్యేది కాదంటే అతిశయోక్తి కాదు. తర్వాత హైదరాబాద్‌లోనే సినిమా షూటింగ్, అనంతర కార్యక్రమాలు అక్కడే పూర్తి చేసి విడుదల చేసేస్తున్నారు. కానీ ఇప్పుడిప్పుడే పరిస్థితుల్లో కాస్త మార్పు కనిపిస్తోంది. విశాఖతో పాటు విజయనగరంలోనూ తెలుగు, తమిళ, హిందీ చిత్రాల నిర్మాణం జరుగుతోంది.

చిన్నవాళ్లకు అవకాశాలు

ప్రస్తుతం మల్టీ స్టారర్‌తో పాటు మల్టీ లాంగ్వేజ్ చిత్రాలు ఎక్కువగా రూపొందుతున్నాయి. వాటికి తగ్గట్టు స్థానిక కళాకారులను వినియోగించుకుంటున్నారు. తమిళ, హిందీ చిత్రాల్లో తెలుగు నేటివిటీ కోసం స్థానిక పరిసరాల్లో షూటింగ్ జరిపి, లోకల్ ఆర్టిస్టలకు అవకాశం ఇస్తున్నారు. అయితే రెమ్యునరేషన్ విషయంతో మాత్రం ఇంకా మార్పు రాలేదు. గతంలో వేషం కావాలంటే ఎదురు డబ్బులిచ్చి వేషం పొందేవారు. ఇప్పుడు మంచి వేషం ఇస్తాం, ఉచితంగా చేయమని అడుగుతున్నారు. వెండితెరపై కనిపిస్తే మరిన్ని అవకాశాలు వస్తాయన్న ఆశతో చాలా మంది ఆర్టిస్టులు ఉచితంగానే నటిస్తున్నారు. జిల్లాలో ఆర్టిస్టులతో పాటు డైరెక్షన్, రైటింగ్, కెమెరా, టెక్నికల్ విభాగాలకు కావాల్సినంత మంది ఉన్నారు.

ఆదరణ పెరిగింది



సినిమా షూటింగ్‌లకు విజయనగరం, విశాఖ తదితర ప్రాంతాలు వేదికగా నిలిచాయి. ఇటీవలికాలంలో ఆదరణ బాగా పెరిగింది. ప్రధానంగా ఎక్కడా లేనివిధంగా సహజత్వంగా ఉండే లొకేషన్లు ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది. సముద్రానికి దగ్గరగా, ఎర్రదిబ్బలు, అరకు అందాలు, రిసార్ట్‌లు, పచ్చని పొలాలు, ఆధ్యాత్మిక పరిసరాలు ఆకట్టుకుంటున్నాయి. కళాకారులు విజయనగరం వచ్చారంటే ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో స్పందిస్తే మరింత బావుంటుంది.

– పడాల కల్యాణి, మూవీ ఆర్టిస్ట్, విజయనగరం

బయటి నుంచి వస్తున్న వారు వీరిని పెద్దగా వినియోగించుకోవడం లేదు. దీంతో వీరు తమ టాలెంట్‌ను షార్ట్‌ఫిల్మ్‌లకే పరిమితం చేసుకోవాల్సి వస్తోంది.

షూటింగ్... నాడు నేడు!

ఉత్తరాంధ్ర ప్రధానంగా షార్ట్‌ఫిల్మ్ నుంచి ప్రారంభమై నేడు సినిమా షూటింగ్‌లకు వేదికగా నిలిచింది. ప్రధానంగా తాటిపూడి రిజర్వాయర్ ప్రాంతంలో ఇప్పటి వరకూ వందలాది సినిమాలు రూపుదిద్దుకున్నాయి. బొబ్బిలి, విజయనగరం కోటలు, భోగాపురం సన్‌రే రిసార్ట్స్, ఎస్‌కోట పరిసర అందాలను దర్శకులు చక్కగా వినియోగించుకున్నారు. విజయనగరంలో జంధ్యాల రెండు రెళ్లు ఆరు, జొన్నవలసలో కె.విశ్వనాథ్ శుభసంకల్పం తీశారు. గోవిందపురం, కోనాడ, ఆలయాలు, రామనారాయణం, బొబ్బిలి వేణుగోపాలస్వామి ఆలయం తదితరాలనూ విడిచిపెట్టలేదు. వాస్తవానికి విజయనగరంలో సినిమా షూటింగ్ చేస్తే ఆ సినిమా వంద రోజులు గ్యారంటీ అనే సెంటిమెంట్ కొందరు హీరోల మనసులో బలంగా నాటింది. అందువల్ల చివరి బిట్‌లోనైనా ఇక్కడ షూట్ చేస్తారు. ఇటీవలే కోట ప్రాంగణంలో 'ఒక మనసు', వెంకటేష్ హీరోగా 'దృశ్యం' సినిమాను గంటస్తంభం, మూడులాంతర్లు పరిసరాలలో చిత్రీకరించారు. గతంలో తరుణ్ హీరోగా భలేదొంగలు సినిమా కోట ప్రాంగణంలో చిత్రీకరించారు. కోరుకొండ సైనిక్ స్కూల్‌లో నాగవల్లి సినిమా వెంకటేష్‌తో చిత్రీకరించారు. అదేవిధంగా బాలకృష్ణ హీరోగా సమరసింహారెడ్డితో పాటు అనేక సినిమాలు అశోక్ బంగ్లాలో చిత్రీకరించారు. వి.వి.వినాయక్ డైరెక్షన్‌లో తీసిన ఆది చిత్రం కోరుకొండ సైనిక్ స్కూల్లో చిత్రీకరించారు.

సినీరంగంలో ఎందరో జిల్లా వాసులు

హీరోలు, హీరోయిన్లు, సంగీతం, దర్శకత్వం, ఇలా ప్రతి రంగంలోనూ విజయనగరం నుంచి వెళ్లినవారున్నారు. కాటమరాయుడు, గోపాల గోపాల, తడాఖా చిత్ర దర్శకుడు డాలీ కిశోర్ కుమార్ ఇక్కడి నుంచే వెళ్లారు. సినిమా చూపిస్తా మావ నక్కా త్రినాథరావు, నేను లోకల్ సినిమా మాటల రచయిత, ఆర్టిస్ట్, దర్శకుడు హర్షవర్ధన్ విజయనగరానికి చెందిన వారు. సంగీతంలో సాలూరు రాజేశ్వరరావు వారసులుగా కోటి, వాసూరావు, వారి కుమారుడు హీరోగా రాజీవ్ మన ఖ్యాతిని పెంచారు. మ్యూజిక్ డైరెక్టర్‌గా పడాల తారకరామారావు ఎదుగుతున్నారు. ఈయన చినజీయర్‌స్వామి ఆస్థాన గాయకుడుగా ఉన్నారు. ప్రస్తుతం చిన్న సినిమా నుంచి పెద్ద సినిమాల్లోనూ సంతోష్ అనే యువకుడు నటిస్తూ జిల్లా ఖ్యాతిని పెంచుతున్నారు. రెండు కాళ్లూ లేకపోయినా లారెన్స్ శిష్యుడిగా పేరు సంపాదించి నాగార్జున నటించిన డాన్, రాజేంద్రప్రసాద్‌తో ఆ నలుగురు, చిత్రంతో పాటు మెగాస్టార్ మన్ననలు పొందిన మహేష్ ఇక్కడివాడే.

కొత్తవారికి అవకాశాలు

సినీరంగంలోకి వెళ్దామనుకుని కలలు గన్న ఎందరో కళాకారులకు ఇదో వరంగా మారింది. చిన్న సినిమాల దగ్గర నుంచి పెద్ద సినిమాల వరకూ ఎంపికలు విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం వేదికలుగా జరుగుతున్నాయి. చిన్న దర్శకులు ఇప్పటికే విజయనగరంలో ఎంపికలు నిర్వహించడం ప్రారంభించారు. ఏ మాత్రం తమ టాలెంట్‌ను బయటపెట్టినా మంచి అవకాశాలు అందుకునే అవకాశం ఉందనడంలో అతిశయోక్తి లేదు. ఇప్పటికే స్థానిక ఎన్‌సీఎస్ థియేటర్ వెనుక యాక్టింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభించారు.

అద్భుతమైన లొకేషన్లు జిల్లా సొంతం



ఉత్తరాంధ్ర జిల్లాల్లో సినిమా నిర్మాణం బాలచందర్‌తో ప్రారంభమైంది. మూగమనసులో ఓ సీన్ హనీమూన్ షాట్ రాజావారి కళాశాలలో చిత్రీకరించారు. రాఘవేంద్రరావు ప్రేమకానుక తీశారు. బ్లాక్ అండ్ వైట్‌లో ఎన్నో చిత్రీకరించారు. మద్రాసులో సినిమా స్థిరపడటం వల్ల చాలా రోజులు సినీ ఇండస్ట్రీ వెనక్కి వెళ్లింది. బాలచందర్ మరో చరిత్ర ద్వారా అద్భుతమైన లొకేషన్లలో సినిమా తీశారు. కమర్షియల్ హీరోలు, నిర్మాతలు అందమైన లొకేషన్లపై దష్టిపెట్టాలి. ఉత్తరాంధ్ర జిల్లాలో ఎక్కువగా చిన్నసినిమాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం జిఓ నంబర్ 80 ప్రకారం పాత సబ్సిడీ విధానాన్ని మరలా పునరుద్ధరించాలి. అలా చేస్తే సినిమాలు పెరుగుతాయి.

– డాక్టర్ పి.సి.ఆదిత్య, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ గ్రహీత, దర్శకుడు

ప్రేమికుల ఆత్మహత్య

- రైలు కింద పడి...
- పొందూరులో ఘటన
- బోడందొరవలసలో విషాదం







బోడందొరవలస గ్రామంలో విషాద వదనంలో వున్న విజయ్ బంధువులు

వారు కలిసి చదువుకున్నారు. ఒకరినొకరు ఇష్టపడ్డారు. పెళ్లి చేసుకొని జీవిద్దామనుకున్నా... పెద్దలు వారి ప్రేమను ఒప్పుకోలేదు. ఇక జీవితం వృథా అనుకున్నారు. ఓ వైపు మైనర్లు కావడం, మరోవైపు అన్ని విధాలా ఆటంకాలు రావడంతో చేసేది లేక మరణమే శరణమని భావించారు. వినాయక చవితి రోజు ఆత్మహత్యకు పాల్పడ్డారు. శ్రీకాకుళం జిల్లా పొందూరు రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు...

రాజాం సిటీ/పొందూరు(శ్రీకాకుళం): పొందూరుకు చెందిన ఆచంటి మహాలక్ష్మి (19), రాజాం నగరపంచాయతీ పరిధి కొండంపేటకు చెందిన ఇజ్జిపురపు విజయ్‌కుమార్(19) రాజాంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. వీరిద్దరి మధ్య స్నేహం కాస్త ప్రేమగా మారింది. ఈ విషయం ఇరు కుటుంబాల్లో తెలియడంతో ఇటీవల వివాదాలు చోటుచేసుకున్నాయి. మహాలక్ష్మికి చెందిన కుటుంబీకులు నెలరోజుల క్రితం రాజాంలోని వారు చదువుతున్న ప్రైవేటు డిగ్రీ కళాశాలకు చేరుకొని కళాశాల యాజమాన్యంతో తగాదాకు దిగినట్టు తెలిసింది. దీంతో పాటు మహాలక్ష్మిని అక్కడ చదువు మాన్పించేసి శ్రీకాకుళంలోని ఓ కళాశాలలో చేర్పించారు. దీన్ని జీర్ణించుకోలేక వీరు మానసిక క్షోభ అనుభవించారు. చివరకు ఈ నెల 24న సాయంత్రం విజయ్‌కుమార్ రాజాంలోని ఇంటి నుంచి బయలుదేరి బయటకు వెళ్లాడు. మరోవైపు మహాలక్ష్మి కూడా శుక్రవారం తెల్లవారుజాము నుంచి కనిపించలేదు. దీంతో ఒకవైపు మహాలక్ష్మి కుటుంబీకులు, మరోవైపు తమ కుమారుడు ఇంటికి రాకపోవడంతో విజయ్‌కుమార్ తల్లిదండ్రులు వెతుకులాట ప్రారంభించారు. ఈ సమయంలో ఇరు కుటుంబాలకు చెందిన సెల్ ఫోన్లకు మేము చనిపోతున్నామనే మెసేజ్‌లు ప్రేమికులు నుంచి వచ్చాయి. ఇంతలోనే పొందూరు రైల్వేస్టేషన్ సమీపంలో మహాలక్ష్మి, విజయ్‌కుమార్ ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందిన సమాచారం రావడంతో ఇరు కుటుంబీకులు బోరున విలపిస్తూ సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

బోడందొరవలసలో విషాద ఛాయలు

మెరకముడిదాం(చీపురుపల్లి): మండలంలోని గర్భాం మేజర్ పంచాయతీ మధుర గ్రామమైన బోడందొరవలస గ్రామానికి చెందిన ఇజ్జిపురపు విజయ్(20) శ్రీకాకుళం జిల్లా పొందూరు గ్రామానికి చెందిన మహాలక్ష్మి అనే యువతితో ప్రేమలో పడ్డాడు. వీరి ప్రేమను తమ పెద్దలు ఒప్పుకుంటారో, లేదోనన్న అనుమానంతో శుక్రవారం పొందూరు రైల్వేస్టేషన్‌కు సమీపంలో ట్రైన్ క్రింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే...బోడందొరవలస గ్రామానికి చెందిన ఇజ్జిపురపు శ్రీనివాసరావు కొన్నాళ్లుగా రాజాంలో లారీ మెకానిక్‌గా స్థిరపడ్డాడు. అతనికి ఇద్దరు కుమారులు వున్నారు. పెద్ద కుమారుడైన విజయ్ రాజాం జీఎంఆర్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ చదువుతున్నాడు. విజయ్ కొన్ని నెలలుగా పొందూరుకు చెందిన మహాలక్ష్మితో ప్రేమలో పడ్డాడు. ఇద్దరూ ఒకరినొకరు ఇష్టపడ్డారు. ఈ విషయాన్ని పెద్దలకు చెబితే తమ ప్రేమను ఒప్పుకోరేమోనన్న భయంతో శుక్రవారం పొందూరు రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో బోడందొరవలస గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

చెరువులో పడి వ్యక్తి మృతి



చెరువులో పడి మృతిచెందిన హరిబాబు

మక్కువ(సాలూరు): మండలంలోని మేళాపువలస గ్రామానికి చెందిన ఆమిటి హరిబాబు(34) గురువారం రాత్రి చెరువులో పడి మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం సాయంత్రం గ్రామం సమీపంలో ఉన్న పెదచెరువు గట్టుపై హరిబాబు పశువులను మేతకు తీసుకువెళ్లాడు. సాయంత్రం 6.30గంటల ప్రాంతంలో పశువులు చెరువులోకి దిగడంతో వాటిని చెరువు నుంచి బయటకు తరలించేందుకు చెరువులో దిగాడు. చెరువు లోతుగా ఉండటంతో బయటకు రాలేక మునిగిపోయి మృతి చెందాడు. హరిబాబు చెరువులో దిగిన విషయాన్ని చెరువు ఆవలి ఒడ్డున ఉన్న గ్రామానికి చెందిన కొయ్యాన పారయ్య గమనించాడు. చెరువులోకి దిగి ఎంతసేపటకి హరిబాబు రాకపోవడాన్ని గుర్తించి, గ్రామస్తులుకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చెరువులో దిగి వెతకగా అప్పటికే హరిబాబు మృతి చెందడంతో మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి పోలీసులకు సమాచారం అందించారు. శుక్రవారం ఉదయం ఎస్ఐ వెలమల ప్రసాదు సంఘటన స్థలాన్ని, మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సాలూరు సీహెచ్‌సీకు తరలించారు. మృతునికి భార్య శోభ, నాలుగేళ్ల బంగార్రాజు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



అట్రాసిటీ కేసు విచారిస్తున్న డీఎస్పీ త్రినాథ తదితరులు

వేపాడ: మండలంలోని అరిగిపాలెం గ్రామంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు విచారణను డీఎస్పీ టి.త్రినాథ్ చేపట్టారు. కొత్తవలస కోర్టు ఆదేశాల మేరకు శనివారం గ్రామంలో ఫిర్యాదుదారుడు నుంచి వాగ్మూలం తీసుకునేందుకు డీఎస్పీ ప్రయత్నించగా ఫిర్యాదుదారు గాలి ఈశ్వర్రావు తిరస్కరించారు. తాను ఎస్సీ, ఎస్టీ పీసీఆర్ సెల్ సీఐడీ అధికారులుకు న్యాయం కోసం ఫిర్యాదు చేసినందున సీఐడీ అధికారులు దర్యాప్తు చేపట్టాలని కోరారు. తాను చేసిన ఫిర్యాదులో పోలీసులు అధికారులున్నందున సీఐడీ దర్యాప్తు చేయించాలని ఫిర్యాది డీఎస్పీకి స్పష్టం చేశారు. దీంతో ఫిర్యాదుదారుడు నుంచి వాంగ్మూలం తీసుకుని పోలీసులు వెనుదిరిగారు. విచారణలో ఎస్.కోట సీఐ బండారు రమణమూర్తి, వల్లంపూడి ఎస్ఐ క్రిష్ణమూర్తి, వీఆర్ఓ అప్పారావు, పంచాయతీ కార్యదర్శి కన్నంనాయుడు, విశాఖ జిల్లా బీఎస్పీ అధ్యక్షుడు బోని క్రిష్ణ, ఏపీ దళిత కూలీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.అచ్చారావు, దేబార్కి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో గుర్తు తెలియని మహిళ మృతి



గుర్తు తెలియని మహిళ మృతదేహం

సాలూరు: పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. శనివారం ఆసుపత్రి వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. వివరాల్లోకి వెళ్తే...ఈ నెల 23న 108 సిబ్బంది తలకు గాయాలైన మహిళను ఆసుపత్రికి తీసుకువచ్చారు. అయితే ఆమె అపస్మారక స్థితిలో పడి వుండడంతో పాటు ఆమె వద్ద ఎవరూ లేకపోవడంతో మెరుగైన వైద్యసేవలందక ప్రాణం వీడినట్టు భావిస్తున్నారు. కాగా మృతురాలికి 35ఏళ్ల వయసు వుంటుందని, ఆమెకు మతిస్థిమితం లేకుండా పలు ప్రాంతాలలో తిరుగుతుండేదని వైద్య సిబ్బంది తెలిపారు.

భారీగా ఖైనీ, గుట్కా నిల్వల పట్టివేత

- రాయగడ నుంచి విశాఖకు సరుకు తరలింపు
- మార్కెట్ ధర రూ. 4లక్షల పైమాటే...



వన్‌టౌన్ వద్ద నిందితులతో సీఐ చంద్రశేఖర్

విజయనగరం టౌన్: ఒడిశా రాష్ట్రం రాయగడ నుంచి విశాఖ వెళ్లే మార్గ మధ్యలో స్థానిక కలెక్టరేట్ జంక్షన్ వద్ద పోలీసు తనిఖీల్లో భారీగా ఖైనీ, గుట్కా నిల్వలు బయటపడ్డాయి. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వన్‌టౌన్ సీఐ చంద్రశేఖర్ వివరాలను వెల్లడించారు. నిషేధిత ఖైనీ, గుట్కాలను రాయగడ నుంచి విశాఖకు తరలించేందుకు వ్యాపారులు వి.సన్యాసిరావు (మాధవధార, విశాఖ), రమేష్ (కంచరపాలెం,విశాఖ)లు సిద్ధమయ్యారు. లారీడ్రైవర్ మల్లినాయుడు, క్లీనర్ సింహాద్రినాయుడులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. సుమారు అక్కడ రూ.2లక్షల విలువైన సరుకును (మార్కెట్‌లో రూ.4లక్షలుపైనే) బ్యాగ్‌లలో ఎక్కించి విశాఖకు తరలించేందుకు సిద్ధమయ్యారు. లారీ విజయనగరం కలెక్టరేట్ జంక్షన్ వద్దకు రాగానే అనుమానం వచ్చిన పోలీస్ బృందం వాటిని తనిఖీ చేయగా అందులో ఖైనీ, గుట్కాలు భారీగా కనిపించాయి. యజమానులతో పాటు, లారీ డ్రైవర్, క్లీనర్లను పోలీస్‌స్టేషన్‌కు లారీతో పాటు తరలించారు. 35 బ్యాగుల్లో ఇద్దరి వాటా ఉన్నాయని, నలుగురిపైన కేసులు నమోదు చేస్తామని, లారీ సీజ్ చేస్తామన్నారు. సమావేశంలో వన్‌టౌన్ ఎస్ఐ బి.లక్ష్మణరావు తదితరులున్నారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సిబ్బందిని అభినందించారు.

పెళ్లయిన ఆరు నెలలకే...

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

- అత్తింటి వేధింపులే కారణమంటున్న తల్లిదండ్రులు




రామారావు, రాజేశ్వరి(ఫైల్)

నెల్లిమర్ల: పెళ్లయిన ఆరు నెలలకే ఓ నవ వధువు(20) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. అత్త, ఆడపడుచులే కిరోసిన్ పోసి కాల్చి చంపారని ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. స్థానికులు, బంధువుల వివరాల ప్రకారం... గరివిడి మండలం కుమరాం గ్రామానికి చెందిన రాజేశ్వరిని నెల్లిమర్ల పట్టణం అలబానవీధికి చెందిన కారుకొండ రామారావుకిచ్చి ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహం చేశారు. పెళ్లయిన నుంచే అత్త మారమ్మ, ఆడపడుచు రాజేశ్వరిని ఇబ్బంది పెట్టేవారు. అదనపు కట్నం కోసం తరచూ వేధించేవారు. ఆమెను తిడుతూ మానసికంగా హింసించేవారు. కొన్ని సందర్భాల్లో ఆమెను శారీరకంగా హింసకు గురి చేసేవారు. వినాయక చవితి పండగకి వారం రోజుల క్రితం రాజేశ్వరి కన్నవారింటికి వెళ్లింది. శనివారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో నెల్లిమర్ల విచ్చేసింది. వచ్చిన దగ్గర నుంచీ అత్త, ఆడపడుచులు తిట్టడం మొదలుపెట్టారు. రాజేశ్వరిని పెద్దగా నోరేసుకుని తిడుతున్నట్లు చుట్టుపక్కల వారికి వినిపించినప్పటికీ అడిగేందుకు ఎవరూ సాహసించలేదు. ఇంతలోనే ఇంట్లోంచి పెద్దగా అరుపులు వినిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చేటప్పటికే రాజేశ్వరి మృతి చెందింది. ఒళ్లంతా కాలిపోయి బాత్‌రూమ్‌లో విగతజీవిగా పడి ఉంది. పక్కనే కిరోసిన్ డబ్బా ఉంది. ఆ దృశ్యం చూసే వారికి హృదయవిదారకంగా అనిపించింది. మృతురాలి తల్లిదండ్రులు ఘటనాస్థలికి వచ్చి బోరుమన్నారు. తమ కూతురిని అత్తవారే కాల్చిచంపారని రోదించారు. గుర్ల ఎస్ఐ రవి ఆధ్వర్యంలో పోలీసులు వివరాలు సేకరించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవిష్యం

మేషం: పనుల్లో ముందడుగు. ఆస్తిలాభం. కార్యజయం. ఆస్తి వివాదాల పరిష్కారం. శుభవార్తలు. వాహనయోగం. వ్యాపారవృద్ధి. ఉద్యోగులకు ఉన్నతహోదాలు.

వృషభం: కొత్త వ్యక్తుల పరిచయం. శుభకార్యాలకు హాజరవుతారు. ఆలయ సందర్శనం. విందువినోదాలు. కుటుంబ సభ్యులతో సఖ్యత. వృత్తి, వ్యాపారాలు సాఫీగా సాగుతాయి.



మిథునం: పనుల్లో జాప్యం. ఆర్థిక ఇబ్బందులు. ఆకస్మిక ప్రయాణాలు. ఆస్తి వివాదాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒత్తిడులు.

కర్కాటకం: దూరప్రయాణాలు. కార్యక్రమాలలో ఆటంకాలు. వ్యయప్రయాసలు. బంధువిరోధాలు. అనారోగ్యం. వ్యాపారాలు నిరాశ. ఉద్యోగులకు పనిభారం.

సింహం: నూతన పరిచయాలు. సంఘంలో గౌరవం. వస్తు, వస్త్రలాభాలు. చిన్ననాటి మిత్రుల కలయిక. విందువినోదాలు. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగులకు మంచి గుర్తింపు.

కన్య: వ్యయప్రయాసలు. బంధుమిత్రులతో వివాదాలు. అనుకోని ప్రయాణాలు. ఇంటాబయటా చికాకులు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒడిదుడుకులు.

తుల: దూరపు బంధువుల కలయిక. యత్నకార్యసిద్ధి. చిన్ననాటి మిత్రుల నుంచి కీలక సమాచారం. భూములు, వాహనాలు కొంటారు. వృత్తి, వ్యాపారాలలో అనుకూల మార్పులు.

వృశ్చికం: వ్యవహారాలలో ఆటంకాలు. ఆదాయానికి మించిన ఖర్చులు. బంధువులతో మాటపట్టింపులు. ఆధ్యాత్మిక చింతన. వ్యాపార, ఉద్యోగాలలో నిరుత్సాహం.

ధనుస్సు: దూరప్రాంతాల నుంచి కీలక సమాచారం. విందువినోదాలు. కార్యజయం. గత సంఘటనలు గుర్తుకు వస్తాయి. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగులకు ఉన్నతస్థితి.

మకరం: ఇంటర్వ్యూలు రాగలవు. ఆస్తి వివాదాల పరిష్కారం. శుభవార్తలు. కుటుంబసభ్యులతో ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ప్రోత్సాహకరంగా ఉంటుంది.

కుంభం: రాబడికి మించి ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. కుటుంబసమస్యలు. అనారోగ్యం. దైవదర్శనాలు. వృత్తి, వ్యాపారాలలో నిరాశ తప్పకపోవచ్చు.

మీనం: వ్యవహారాలలో అవరోధాలు. ధనవ్యయం. బంధువులతో తగాదాలు. ఆరోగ్యభంగం. వ్యాపారాలు సామాన్యంగా ఉంటాయి. ఉద్యోగులకు కొద్దిపాటి చికాకులు.

– సింహంభట్ల సుబ్బారావు

సేవలు

సోమవారం	మంగళవారం	బుధవారం	గురువారం	శుక్రవారం	శనివారం	ఆదివారం
సంస్కృతి	రైల్వే	ప్రజావసరాలు	మనకోసం	లైఫ్ స్టైల్	షాపింగ్	రవాణా

దూర ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసుల టైమింగ్స్

విజయనగరం అర్బన్: స్థానిక ఆర్టీసీ బస్‌కాంప్లెక్స్ నుంచి దూరప్రాంతాలకు వెళ్లే పలు సర్వీసుల తాజా టైమింగ్స్‌ను నార్త్‌ఈస్ట్ కోస్టు అధికారులు ప్రకటించారు. ప్రయాణికుల సౌకర్యార్థం టైమింగ్స్‌ను సవరించి విడుదల చేశామని అధికారులు పేర్కొన్నారు. దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు రిజర్వేషన్‌ను చేసుకునే విధంగా ఆన్‌లైన్ సేవలను విస్తరించామని తెలిపారు. పూర్తి వివరాల కోసం 08922-225333 ఫోన్‌కు సంప్రదించాల ని సూచించారు. విజయనగరం పట్టణం మీదుగా నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సు సర్వీసుల టైమింగ్స్ ఇలా ఉన్నాయి.

- **హైదరాబాద్:** మధ్యాహ్నం 3.15 గంటలకు
- **విజయవాడ:** ఉదయం 6.15, 6.45, 7.15, 8.30, 9.30, 10.30 గంటలకు, మధ్యాహ్నం 12.15, 12.30, 01.15 గంటలకు, 04.30, 05.15, రాత్రి 08.15, 10.30 గంటలకు అర్ధరాత్రి 12.15 గంటలకు,
- **భద్రాచలం:** ఉదయం 05.30 గంటలకు.
- **రాజమండ్రి:** ఉదయం 06.00 గంటలకు, 07.00 గంటలకు, మధ్యాహ్నం 12.15 గంటలకు, మధ్యాహ్నం 02.00 గంటలకు, రాత్రి 07.30 గంటలకు.
- **కాకినాడ:** ఉదయం 08.15 గంటలకు, 08.45 గంటలకు, 09.30 గంటలకు, 10.45 గంటలకు, మధ్యాహ్నం 02.30 గంటలకు, రాత్రి 09.45 గంటలకు.
- **రావులపాలెం:** ఉదయం 09.30 గంటలకు.
- **రామచంద్రాపురం:** ఉదయం 05.00, మధ్యాహ్నం 1.00 గంటలకు.
- **నవరంగపూర్:** ఉదయం 5.00 గంటలకు, 6.00 గంటలకు, 10.15 గంటలకు.
- **జగదల్‌పూర్:** ఉదయం 7.30 గంటలకు, మధ్యాహ్నం 12.00 గంటలకు.
- **జైపూర్:** ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం 1.00 గంటకు, 02.30,గంటలకు, సాయంత్రం 6.00 గంటలకు.
- **దమన్‌జోడి:** ఉదయం 9.15 గంటలకు, మధ్యాహ్నం 3.15 గంటలకు.

విశాఖ విమానాశ్రయం నుంచి విమానవేళలు...

విమానం		రాక	బయలుదేరువేళ	వారం
ఎయిర్ ఆసియా	బెంగుళూరు–విశాఖ–బెంగుళూరు	07.40	08.05	రోజూ
ఇండిగో	ఢిల్లీ–విశాఖ–హైదరాబాదు/ముంబయ్	07.50	08.20	రోజూ
ఎయిర్ ఇండియా	దుబాయ్/హైదరాబాదు–విశాఖ–ఢిల్లీ	08.00	08.50	రోజూ
ఎయిర్‌కోస్తా	చెన్నై/హైదరాబాదు–విశాఖ–బెంగుళూరు/జైపూర్	08.20	08.40	రోజూ
ఇండిగో	చెన్నై–విశాఖ–భువనేశ్వర్/కోల్‌కతా	08.25	08.55	రోజూ
స్పైస్‌జెట్	ముంబయ్/హైదరాబాదు–విశాఖ–హైదరాబాదు	08.25	08.50	రోజూ
ఎయిర్‌ఇండియా	ఢిల్లీ–విశాఖ–పోర్టుబ్లెయిర్	09.15	09.55	ఆది,బుధ
ఎయిర్‌కోస్తా	బెంగుళూరు–విశాఖ–హైదరాబాదు/చెన్నై	12.35	13.00	రోజూ
ఇండిగో	ముంబయ్/హైదరాబాదు–విశాఖ–హైదరాబాదు/ముంబయ్	12.30	13.05	రోజూ
ఇండిగో	బెంగుళూరు–విశాఖ–బెంగుళూరు	12.50	13.20	సోమ,మంగళ, గురు,శని
ఎయిర్‌కోస్తా	తిరుపతి–విశాఖ–తిరుపతి	4.00	14.20	రోజూ
ఎయిర్‌ఇండియా	ముంబయ్/రాయ్‌పూర్–విశాఖ–ముంబయ్	14.00	14.40	రోజూ
ఇండిగో	కోల్‌కతా/భువనేశ్వర్–విశాఖ–చెన్నై	14.20	14.45	రోజూ
స్పైస్‌జెట్	చెన్నై/బెంగుళూరు–విశాఖ–బెంగుళూరు/కొచిన్	15.50	16.20	ఆది,మంగళ, బుధ,గురు,శుక్ర,శని
ఇండిగో	భువనేశ్వర్–విశాఖ–భువనేశ్వర్	14.45	15.15	ఆది, బుధ, శుక్ర
ఎయిర్‌ఇండియా	పోర్టుబ్లెయిర్–విశాఖ–ఢిల్లీ	15.05	15.50	ఆది, బుధ
ఇండిగో	ఢిల్లీ/హైదరాబాదు–విశాఖ–హైదరాబాదు/ఢిల్లీ	16.20	16.50	రోజూ
ఎయిర్‌ఇండియా	ఢిల్లీ–విశాఖ–హైదరాబాదు/దుబాయ్	17.10	18.10	రోజూ
ఇండిగో	హైదరాబాదు–విశాఖ–ఢిల్లీ	18.00	18.30	రోజూ

రామతీర్థం ఆలయ సమాచారం



రామతీర్థం ఆలయంలో స్వామి వారి పూజలు, దర్శన వివరాలు.. ప్రతిరోజూ వేకువజాముున ఐదు గంటలకు ఆలయం తెరిచి 6.30 గంటల వరకు సుప్రభాతం, తీర్థబిందె, శుద్ధి, తిరువారాధన కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం 6.30 నుంచి 7గంటల వరకు బాలభోగం, మంగళాశాసనం కార్యక్రమాలు జరుగుతాయి. అనంతరం 11.30 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు సీతారాముల నిత్యకల్యాణం జరుగుతుంది. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.15 వరకు రాజభోగం ఉంటుంది. మధ్యాహ్నం 12.15 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 8 గంటల వరకు రాత్రిభోగం, మంగళాశాసనం, పవళింపుసేవ కార్యక్రమాలుంటాయి. - నెల్లిమర్ల

విజయనగరం వాతావరణం

గరిష్టం	కనిష్టం
33.9°	26.6°

నేడు : ఓ మోస్తరు వాన కురవొచ్చు. ఆకాశం మేఘావృతమై ఉదయం కాస్త వేడిగా, మధ్యాహ్నం ఉక్కపోతగా ఉండవచ్చు. గరిష్టం 32డి. కనిష్టం: 26డి.

రేపు : ఓ మోస్తరు వానకురవొచ్చు. ఆకాశం మేఘావృతమై ఉదయం ఒత్తిడిగా, మధ్యాహ్నం ఉక్కపోతగా ఉండవచ్చు. గరిష్టం 32 డి. కనిష్టం: 25డి.

మంగళవారం: ఓ మోస్తరు వానపడవచ్చు. తేలికపాటి గాలులు వీయవచ్చు. ఆకాశం మేఘావృతమై ఉదయం ఒత్తిడిగా, మధ్యాహ్నం వేడిగా ఉండవచ్చు. గరిష్టం: 33డి. కనిష్టం:25డి.

ఆస్పత్రి ఫోన్ నంబర్లు

ఆస్పత్రి పేరు	ఫోన్ నంబరు
సాయి ఆస్పత్రి	9441936550
వెంకటరామ ఆస్పత్రి	08922-236759
సిటిస్కాన్ డయోగ్నోస్టిక్స్	08922-222022
వెంకటాద్రి ఆస్పత్రి	9440018606
సాయి రమ్య ఆస్పత్రి	9440120277
వెంకటపద్మ ఆస్పత్రి	7702612346

చికెన్ ధరలు (బ్రాయిలర్)

లైవ్	డ్రెస్డ్(విత్‌స్కిన్)	స్కిన్‌లెస్
రూ. 92	రూ. 154	రూ. 164

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100)

విశాఖపట్నం	362–00
విజయనగరం	366–00
శ్రీకాకుళం	366–00

బులియన్

విశాఖపట్నం

బంగారం (24సి. 10గ్రా)	29,720
బంగారం (22సి. 10గ్రా)	27,780
వెండి కిలో	40,000

మీ కోసం

ట్రైసైకిళ్ల పంపిణీ రేపు

విజయనగరం కంటోన్మెంట్: పార్వతీపురం డివిజన్ మండలాల్లో ఉన్న విభిన్న ప్రతిభావంతులకు సోమవారం ట్రైసైకిళ్లు పంపిణీ చేయనున్నట్లు ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ ఎం.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం వైకేఎం కాలనీలోని వైటీసీలో జరగనున్న ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు అశోక్ గజపతిరాజు, ఆర్‌వీఎస్‌కే రంగారావు హాజరవుతారన్నారు.

ఒకటో తేదీ నుంచి యువజనోత్సవాలు

విజయనగరం కంటోన్మెంట్: యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి జిల్లా స్థాయి యువజనోత్సవాలను స్థానిక మహారాజా కళాశాలలో నిర్వహించనున్నట్లు సెట్విజ్ సీఈఓ ఎం. సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ స్థాయిపోటీల్లో ప్రథమ స్థానం వచ్చిన వారు ఆరోజు ఉదయం 9 గంటలకు కళాశాల వద్ద హాజరు కావాలని పేర్కొన్నారు. అభ్యర్థులు 3 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డుల జిరాక్సులతో నేరుగా పాల్గొనాలని, మరిన్ని వివరాలకు 08922-273768ను సంప్రదించాలన్నారు.

టీటీడీ సమాచారం



తిరుమలలో శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్టుమెంట్లు నిండి క్యూ వెలుపలకు వెళ్లింది.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:

ఉచిత గదులు	–	ఖాళీ లేవు
రూ.50 గదులు	–	ఖాళీ లేవు
రూ.100 గదులు	–	ఖాళీ లేవు
రూ.500 గదులు	–	ఖాళీ లేవు

సేవలు

సహస్రదీపాలంకరణ సేవ	–	ఖాళీ లేవు
వసంతోత్సవం	–	ఖాళీ లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం	–	ఖాళీ లేవు

బుల్లితెర

www.sakshi.com

సాక్షి SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30	సత్యవాక్యం
ఉ.07.00	న్యూస్ 360
ఉ.07.30	కేఎస్‌ఆర్ లైవ్ షో
ఉ.09.00	రీజనల్ న్యూస్
ఉ.09.30	కాకినాడ ఎలక్షన్
ఉ.10.00	సాక్షి న్యూస్
ఉ.10.30	కాకినాడ ఎలక్షన్
ఉ.11.30	కాకినాడ ఎలక్షన్
మ.02.30	కెరీర్ ప్లస్
సా.04.30	కాకినాడ ఎలక్షన్
సా.05.00	స్పీడ్ న్యూస్
సా.05.30	జనపథం
సా.06.30	పండగ వేళ
రా.07.30	స్టార్ స్టార్
రా.08.00	మనసులో మాట
రా.09.00	న్యూస్ 360
రా.10.30	సదరన్ స్పైస్


టీవీలో ఈరోజు సినిమాలు



జెమిని మూవీస్
ఉ.09.30 రొమాన్స్
మ.12.00 కొండవీటి దొంగ
మ.03.00 సత్యమేవ జయతే
సా.06.00 ఏవండీ ఆవిడ వచ్చింది
రా.09.00 సందడి



మూవీస్ నౌ
ఉ.08.00 రిచ్చీ రిచ్
ఉ.10.00 డెత్ రేస్
మ.02.55 యాంట్-మ్యాన్
సా.09.00 క్యాసినో రాయల్
రా.11.55 క్లిఫ్‌హ్యాంగర్




హెచ్‌బీవో
ఉ.07.34 పాన్
ఉ.09.21 కుంగ్‌ఫు పాండా 2
మ.01.00 ద కంజ్యూరింగ్ 2
సా.05.08 సూసైడ్ స్క్వాడ్
రా.11.00 10,000 బి.సి.



స్టార్ మూవీస్
ఉ.06.01 టెర్మినేటర్ సాల్వేషన్
ఉ.10.18 పెంగ్విన్స్ ఆఫ్ మడగాస్కర్
మ.02.57 ఫెంటాస్టిక్ ఫోర్
రా.07.02 అనకొండ 3
రా.09.00 టైటానిక్



మా మూవీస్
ఉ.07.00 ఓం
ఉ.09.30 సత్యం
మ.03.00 అందాల రాక్షసి
సా.05.00 ఈగ
రా.10.30 మహేశ్



జీ సినిమా
ఉ.07.21 జర్నీ బాంబే టు గోవా
ఉ.10.35 హ్యాపీ న్యూ ఇయర్
మ.02.31 వివాహ్
సా.06.04 ధమాల్
రా.09.00 ఫిర్ హెరా ఫెరీ

వినాయక నీ మూర్తికే నా మొదటి ప్రణామం

- వాడవాడలా వెలసిన వినాయక మంటపాలు
- భక్తిశ్రద్ధలతో పూజలు

విజయనగరం టౌన్:

పట్టణంలోని వాడవాడలా వినాయక మంటపాలు వెలిశాయి. ప్రత్యేక మంటపాల్లో విగ్రహాలను శుక్రవారం ప్రతిష్టించారు. ఈ సందర్భంగా కలశ స్థాపన, కుంకుమార్చనలు నిర్వహించి కథను చదివి వినిపించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. తోటపాలెంలో కొలువైన గణనాథుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. అలాగే జొన్నగుడ్డి స్టేడియంపేటలో ఏర్పాటు చేసిన నీటిలో మహాశివుడితో కలిసిన వినాయక విగ్రహం ఆకట్టుకుంటోంది. బాలాజీ మార్కెట్‌లో వివిధ రకాల విగ్రహాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు వివిధ రకాల్లో సెట్లు ఏర్పాటు చేశారు. నాగోజీపేట, రైల్వేస్టేషన్ గాడీఖానా, వసంతవిహార్, గాజులరేగ, రింగురోడ్డు, పూల్‌బాగ్, హుకుంపేటలతో పాటూ స్థానిక కానుకుర్తివారి వీధి కృష్ణసాయి టవర్స్‌లో పర్యావరణాన్ని పరిరక్షిస్తూ నెలకొల్పిన హరిత గణపతి ఆకట్టుకుంది.

వృద్ధులతో మమేకమై..

వినాయకచవితి ఉత్సవాలను ఎస్పీ జి.పాలరాజు పూల్‌భాగ్‌లో ఉన్న వాసవీ వృద్ధాశ్రమంలో జరుపుకున్నారు.ఈ సందర్భంగా వృద్ధుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు సమాజానికి వారసత్వ సంపదని, రాబోయే తరాలవారు ఎన్నో మంచి విషయాలను వీరి ద్వారా తెలుసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ బీవీజే రాజు, టూటౌన్ సీఐ నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చవితి వేడుకలు..

విజయనగరం రూరల్: మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల్లో వినాయకచవితి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో శుక్ర, శనివారాల్లో వినాయక విగ్రహాలకు అభిషేకాలు, పూజలు చేపట్టారు. ఎన్‌సీఎస్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పండితులు అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని 15 పంచాయతీ గ్రామాలు, మధుర గ్రామాల్లో వినాయక ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బియ్యాలపేట పంచాయతీ ముడిదాంలో సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎ.అప్పలరాజు ఆధ్వర్యంలో భారీ వినాయకుని మంటపం ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించారు.



కానుకుర్తి వారి వీధిలో హరిత వినాయకుడు



నాగోజీపేటలో కొలువైన వినాయకుడు



రూరల్: రామనారాయణంలో వినాయకునికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పేదలకు ఇళ్లు ..

విజయనగరం పూల్‌భాగ్: పట్టణంలోని పేదలకు సొంత ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలోని సీఎంఆర్ ఎదురుగా 30 ఏళ్లుగా సుమారు 22 కుటుంబాలు నివాసముంటున్నాయన్నారు. ప్రభుత్వం ఎన్టీఆర్ గృహపథకంలో రూ. ఆరు లక్షలకు ఇళ్లు కట్టించి ఇస్తామని, నెలకి రూ.మూడు వేలు చొప్పున 20 ఏళ్లు కట్టాలని చెబుతున్నారన్నారు. అయితే రోజు కూలి చేసుకునే వారు ఎలా కడతారని ప్రశ్నించారు. అందుకే వారికి ఉచితంగా ఇళ్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్. శ్రీను, జి. రాజు, డి. సన్నిబాబు, పి. రమణమ్మ, జి. పుణ్యవతి, ఆర్. ఆనంద్, బి. రమణ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం ప్రతినిధులు

అభాగ్యులకు దుస్తుల పంపిణీ

విజయనగరం కంటోన్మెంట్: జిల్లా కేంద్రంలో బస్ షెల్టర్లు, ఇతర ప్రాంతాల్లో మగ్గుతున్న అభాగ్యులైన వృద్ధులకు గోపీనాథం సాంస్కృతికక సేవా సంస్థ సభ్యులు శనివారం చీరెలు, పంచెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు నాడిశెట్టి శాంతారావు, సభ్యులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే సమస్యల పరిష్కారం

- డాక్టర్ ఎన్‌వీఎస్ సూర్యనారాయణ

విజయనగరం టౌన్:

భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకుని సర్దుబాటు, సమన్వయంతో వ్యవహరించినప్పుడే సమస్యలు పరిష్కారమై, సంసారం సజావుగా సాగుతుందని ప్రముఖ సైకాలజిస్ట్ ఎన్‌వీఎస్ సూర్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివాహానికి ముందు తమకు కాబోయే జీవిత భాగస్వామి గురించి పూర్తి సమాచారం తెలుసుకోవాలన్నారు. అనంతరం మూడు జంటలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ కె. కుమారస్వామి, ఎస్సై ఎ. వెంకటరావు, సోషల్ వర్కర్ బీవీ జగన్నాథ్, మహిళా సైకాలజిస్ట్ గోటేటి హిమబిందు, మహిళా పోలీసు స్టేషన్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సైకాలజిస్ట్ సూర్యనారాయణ, తదితరులు

సాక్షి సండే క్లాసిఫైడ్స్

NP AV
PC, Laptop
Tablet, Mobile
सुरक्षा
Ransomware Protection
www.npav.net
92.72.70.70.50
98.22.88.25.66

Education

EDUCATION

■ **Free Demo Classes for IBPS Phase VII** (Po's&Clerks) and All Competitive Exams on 27th&28th at 10am-1pm.Mr.Rao's Academy, G.A.Road,VZM. 7075138960, 9441871063 [S- 608513]


■ **SUJANA NDT Training Center Technical** Job Oriented Course Eligibility: 10th,Inter,Degree,ITI,Diploma,B.Tech, VZM. C:8309626660,7095071768 [S- 608501]

COACHING CENTRE

■ **RRB IBPS - New Batch will Start** on Monday (28-8-17) Time: 9 to 12 Noon. **SURYA ACADEMY,** VZM. 9949003295, 8309963619 [S- 615969]

Real Estate

FLAT FOR SALE



■ **VZM RTC** కాంప్లెక్స్‌కు **9.3 KM**లో ఇళ్ళస్థలములు మరియు 2 BKH FLATS అమ్మకమునకు కలవు. 97038 59961 [S- 608509]

PLOTS FOR SALE



■బృందావన్ వ్యాలి **PHASE -1,** L.P. No:73/2015 విజయనగరం మెడికల్ కాలేజ్ దగ్గర 36 ఎకరాలలో ఆధునిక వసతులతో అతి తక్కువ ధరలలో ప్లాట్స్ కలవు. C: 9985656368, 8500120861 [S- 615967]

■ **PLOTS FOR SALE at K.L. PURAM, Vizianagaram.** Suitable for Houses, Villas. Contact: 99892 07347, 96767 07060 [S- 608514]

HOME LOANS
ఆదాయంతో సంబంధం లేకుండా
HOME/MORTGAGE/BUSINESS/PL LOANS
(మీ ఆస్తిపై) అతి తక్కువ వడ్డీకి
5 రోజులలో లోను ఇవ్వబడును
IBL HOME LOANS
✆ 9966622394

■విజయనగరం డెంకాడ గ్రామంలో మా రాబోవు 100 ఎకరాల ఉడా వెంచరులో స్థలం కొనుక్కోనున్న కస్టమర్ దేవుళ్ళకు మరియు పెట్టుబడిదారులకు సువర్ణావకాశం. వెంటనే మీ స్థలం కోసం బుకింగ్ కన్ఫర్మేషన్ ఇవ్వండి. మీరు ఏమీ చెల్లించనవసరం లేదు. ఫోన్‌లో బుక్ చేసుకోవచ్చు. ఈ నెలాఖరులో వెంచర్ ఓపెన్ అయిన వెంటనే మొత్తం చెల్లించి స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఫోన్ : 93460 55524 [V- 902]

■ మదుపరులకు శుభవార్త! వైజాగ్‌లో గేటెడ్ కమ్యూనిటీ **LP**తో భోగాపురం హైవే, తగరపువలస హైవే, ఆనందపురం-శొంఠ్యాం హైవే, సబ్బవరం హైవే, కొత్తవలస హైవే, అచ్యుతాపురం హైవే. ఫ్రీ రిజిస్ట్రేషన్. ఫోన్ : 89784 45498 [V- 596931]

LAND FOR SALE

■గజపతినగరం మరుపల్లిలో 15 సెంట్లు 8మామిడి చెట్లతో 30 అ॥ల రస్తా కలిగిన N/E కార్నర్ వ్యవసాయ మెట్టుభూమి అమ్మకంనకు కలదు. సంప్ర॥ 96669 27007 [S- 615966]

Services

BUSINESS OFFER

■నెలకు అధిక ఆదాయం. ప్లాస్టిక్ పరిశ్రమ - ప్లాస్టిక్ వస్తువులు తయారుచేయు మిషన్లు అమ్మకం. ముడిసరుకు ఇచ్చి తయారైన సరుకు కొంటాం. సంప్ర॥ రేవతి - 91339 44326 & 91339 39826. [R-167]

■ శ్రీ సాయిరామ్ పేపర్‌ప్లేట్ మిషన్స్‌ః తక్కువ పెట్టుబడి, మంచి ఆదాయం, మెటీరియల్ & ట్రాన్స్‌పోర్ట్ ఛార్జెస్ ఉచితం. మిషన్‌కు 5 సం॥ల వారంటీ కలదు. Ph: 81068 82011 [G-597397]

■ తక్కువ పెట్టుబడితో ట్యూబ్ లైట్ చౌక్ తయారు చేస్తూ అధిక ఆదాయం పొందండి. రా మెటీరియ ల్ మేమే ఇస్తాము. తయారీ సరుకు మేమే కొంటాము. 8978517836, 040-40021822. [H-618886]

GOLD LOANS



■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 75055 56666 [V- 1459]

యాత్రలు

■ 2/9 & 24/10 రామేశ్వరం, 17/8 & 28/11 పంచద్వారకలు, 5/9 & 22/9 చారదం, 17/10 & 31/10 కాశీ, 11/9 నుండి 22/9 వరకు డైలీ కావేరీ పుష్కర యాత్ర. 22/9 శ్రీ లంక, నేపాల్, కేరళ ట్రిప్స్.. సాయిచరణ్ : 93983 36779 [P-872906]

Wanted

■ **10th P/F Vizag Star Hotels** నందు పనిచేయుటకు సిబ్బంది కావలెను. జీ: 6000/- రూ మరియు ఉచిత వసతి, బోజనం. Biodata తో సంప్రదించండి. లక్ష్య ప్లేస్‌మెంట్స్, VZM. 9676604005 [S- 608510]

■ **CHALIX MICRONS INDIA Pvt. Ltd Boddavara.** Junior Accountant,Accountant&Tally Experience.Candidates 4Nos Requirement Urgently. Email: naveen@chalixmicrons.com. 9618781103 [S- 608609]

■ ఆంధ్రా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, **L&G** వారి ఇండియా ఫస్టు నందు జోనల్ మార్కెటింగ్ అసోసియేట్‌గా M/F కావలెను. MDRT/ FMCG & ఆడిటర్స్ & అనుభవం, ప్రాధాన్యత. 83676 36367 [V- 3876]

■ జాబ్ మేళా: గుర్తింపు పొందినYMMC కం.లో శ్రీకాకుళం,విజయనగరంలో జాబ్‌చేయుటకు స్త్రీ/పు కావలెను.అ:10th -డిగ్రీP/F జీ:శిక్షణలో 5500 +రూంఫ్రీ తర్వాత15,000+బైక్. 9000700524. [T-863164]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (విశాఖపట్నంలో) ముసలి వారికి సేవ చేయుటకు (M/F) కావలెను. వయస్సు 20-50 సం॥. భోజనం, వసతి, మంచి జీతం. ✆ 99514 81122, 99514 91122 [V- 596902]

■ **Wanted Christian Home Parents for a** Boy's Home at Arilova, Vizag. Parents to take care of 7-10 boys. Attractive salary, free accommodation, food etc. Qualification : Inter above. Age 30-45 yrs. Send Resume : ashreyacharity@gmail.com. contact : 98497 71355, 98498 29107, 91773 54543. [V- 596812]

■ విజయవాడలోని ప్రముఖడిజిటల్ కలర్ ల్యాబ్ కు పార్వతీపురం, బొబ్బిలి, సాలూరులలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Q : డిగ్రీ, ఆకర్షణీ యమైన జీతం+ఇన్సెంటివ్స్+ అలవెన్స్. 2 వీలర్ మస్ట్, పై ప్రాంతాల వారికి ప్రాధాన్యత. ✆ 80961 85999, 83675 56999 [B-609]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని,వంటపని, వృద్ధులసేవ, పిల్లల పోషణ చేయుటకు స్త్రీలు, హౌస్‌కీపింగ్, (M/F) కావలెను.సంప్ర.9032688849/040-66207272 [H-693227]

■ఏ బాదరబంది లేని వంట తెలిసిన ఆడ వంట మనిషి 18-45 సం॥లోపు ఇంట్లో ఉండి వంట చేయుటకు కావలెను. మంచి జీతం ఇవ్వబడును. వైజాగ్: 99084 22445 [V- 596918]

మీ చిన్నారుల జన్మదినోత్సవ శుభాకాంక్షలు సాక్షి ద్వారా తెలియజేయండి.
నమూనా ప్రకటన



3.5cm x 5cm
మరిన్నివివరములకు మీ దగ్గరలోవున్న సాక్షి ప్రతినిధిని సంప్రదించండి
రూ. 600/-
9705444189
9705444190, 9010133309

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Now you can also book Classifieds online
www.sakshi.com
సాక్షి క్లాసిఫైడ్స్



ఐఐటీలు రీసెర్చ్ కేంద్రాలు

తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కెఎన్.సత్యనారాయణ



ఆర్అండ్‌బీ బ్లాక్‌కు శంకుస్థాపన చేస్తున్న తిరుపతి ఐటీఐ డెరెక్టర్ సత్యనారాయణ

డెంకాడ(నెల్లిమర్ల): ఐఐటీలు రీసెర్చ్ కేంద్రాలని, వీటి ద్వారా ఎన్నో నూతన ఆవిష్కరణలు బయటకు వస్తాయని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కెఎన్.సత్యనారాయణ తెలిపారు. శనివారం చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మహారాజా అలక్ నారాయణ గజతిరాజు 115వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ బ్లాక్ నిర్మాణానికి కేంద్రమంత్రి అశోకగజపతిరాజు సతీమణి సునీలాగజపతిరాజు, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణలు భూమి పూజ చేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాల క్రితం దేశంలో 5 ఐఐటీలే ఉండేవని ప్రస్తుతం 23 ఉన్నాయని తెలిపారు. తిరుపతి ఐఐటీకి ప్రభుత్వం 350 ఎకరాల భూమి కేటాయించిందన్నారు. కార్యక్రమంలో మాన్సాస్ గవర్నింగ్ బాడీ మెంబర్ అతిథి గజపతిరాజు, మాన్సాస్ కరస్పాండెంట్ డిఆర్‌కె.రాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎల్.రాజు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో పాటు ఆర్ట్స్ విద్య అవసరం..

అనంతరం అధ్యాపకులు, విద్యార్థులతో సత్యనారాయణ సమావేశమై ప్రస్తు విద్యా విధానాల గురించి వివరించారు. సాంకేతికత పాటు ఆర్ట్స్ విద్య అవసరమని తెలిపారు. తర్వాత ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసీసీ విభాగం వారు చింతలవలస స్కూల్ విద్యార్థులకు బూట్లు, బ్యాగ్‌లు, టైలు, బెల్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణను కాలేజీ యాజమాన్యం వారు జ్ఞాపికతో సత్కరించారు.

హాస్టళ్లలో సమస్యలపై నివేదిక

విజయనగరం కంటోన్మెంట్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టళ్లలో విద్యార్థుల మరణాలు కలచివేస్తున్నాయని ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక అధ్యక్ష, కార్యదర్శులు మూత మురళీ కృష్ణ, కనిగిరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లాలోని హాస్టళ్లు, గురుకుల కళాశాలల్లో ఐక్యవేదిక బృందం ఇటీవల పరిశీలనలు చేసి కలెక్టర్‌కు ఒక నివేదిక సమర్పించినట్లు తెలిపారు. సరైన వసతులు లేవని, విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారని, పర్యవేక్షణ కొరవడిందన్న విషయం తన పరిశీలనలో తేలిందని పేర్కొన్నారు. నెల్లిమర్ల, జోగెంపేట హాస్టళ్లలో పది రోజుల వ్యవధిలో ఇద్దరు మరణించారని, కొప్పెర్ల కళాశాలలో సౌకర్యాలు లేవని వివరించారు. వియ్యంపేటలో నలుగురు విద్యార్థినులు పరారైనట్లు పేర్కొన్నారు. చాలా చోట్ల ఎప్పుడు ఏం జరుగుతుందోన్న భయంలో విద్యార్థులు కొట్టుమిట్టాడుతున్నట్లు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక కార్యవర్గం సభ్యులు నర్సయ్య, మాలచ్చి, నారాయణ, రామప్పడు ఉన్నారు.

28న జిల్లాస్థాయి జూడో పోటీలు

సాలూరు: ఈ నెల 28న స్థానిక పీఎన్ బొడ్డవలసలో ఏపీ సాంఘిక గురుకుల కళాశాలలో జిల్లా స్థాయి జూడో పోటీలను నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కెఎంపీ.నారాయణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్స్‌ను 3 స్థాయిల్లో ఎంపిక చేయనున్నామని, పోటీల్లో పాల్గొనదలచిన వారు విధిగా జూడో దుస్తులతోనే హాజరు కావాల్సి ఉంటుందని జిల్లా అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ సత్యనారాయణ తెలిపారు.

మొబైల్ లేబరేటరీస్‌పై అవగాహన

విజయనగరం రూరల్:

దేశంలో పాఠశాలలకు ఆధునాతన బోధనా విధానాన్ని అందించేందుకు మెసర్స్ నిశ్చల్స్ స్మార్ట్ లెర్నింగ్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మొబైల్ లేబరేటరీస్ విధానంపై ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. దీనిలో పాల్గొన్న ఎస్ఎస్‌బీ అధికారి పి.లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులకు మొబైల్ లేబరేటరీ చాలా ఉపయోగకరమని, తరగతి గదుల్లో ఒక కొత్త ఒరవడికి నూతన శ్రీకారమని పేర్కొన్నారు. పాఠ్యాంశాలకు అనుగుణంగా ప్రయోగాత్మక బోధనా విధానానికి ఇది తోడ్పడుతుందన్నారు.

దేశంలో ఈ విధమైన ప్రయోగశాల పెట్టడం ఇదే మొదటిసారన్నారు. అనంతరం విజయనగరం కేజీబీవీకి ఈ ప్రయోగశాలను అందించారు. దీనిపై అవగాహన పెంచుకోవడానికే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గణిత మేధావి నారాయణం నిశ్చల్ తెలిపారు. ఈ విధానం ఐఎస్ఓ 9001 : 2008 వారితో పాటు ఎన్‌సీఈఆర్‌టీ సంస్థ ఆమోదం పొందిందన్నారు. కార్యక్రమంలో జీసీడీఓ సత్యవతి, ఏపీఓ గోపిచంద్, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

సాలూరులో గంజాయి మూలాలు!

సాలూరు రూరల్:

గంజాయి మూలాలు సాలూరును కూడా తాకాయి. తెలిసిన వివరాల ప్రకారం...ఈ నెల 21న విశాఖపట్నంలో పి.ఎమ్.పాలెం సర్కిల్ పరిధిలో టాస్క్‌ఫోర్స్, పోలీసులు గంజాయి ముఠాను పట్టుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ నిర్వహించారు. దర్యాప్తులో భాగంగా నిందితులు కాల్ డేటాను చెక్ చేయగా సాలూరుకు చెందిన వ్యక్తి నుంచి అధిక ఫోన్లు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. సదరు నెంబరు ఆధార్ కార్డు వివరాలు ఆధారంగా సాలూరు మండలంలోని సారిక పంచాయతీ దండిగాం గ్రామానికి పోలీసుల ప్రత్యేక బృందం శుక్రవారం వెళ్లింది. స్థానిక సర్పంచ్ ప్రతినిధి గొర్లె రాజారావు ఇంటికి వెళ్లి సదరు ఆధార్ కార్డు నెంబరు గల గ్రామానికి చెందిన కనకల ఆనందరావు అనే వ్యక్తిని ఇంటికి పిలిపించి ప్రశ్నించారు. సాలూరు పట్టణంలో ఉన్న తన ఇంట్లో అద్దెకు దిగిన ఓ మార్వాడికి సిమ్ కొరకు నా ఆధార్ కార్డు ఇచ్చానని తనకేమి తెలియదని ఆనందరావు బదులిచ్చారు. నీ ఆధార్ కార్డును ఇచ్చిన వ్యక్తిని చూపించమని పోలీసులు అడుగగా బృందంతో పాటు సాలూరు వెళ్లారు. కాల్ డేటాలో ఉన్న ఫోన్ నెంబరును వాడుతున్న సదరు వ్యక్తిని చూపించడంతో వెంటనే పోలీసులు ఆ వ్యక్తిని (మార్వాడీ వ్యక్తిని)అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా ఈ కేసుకు సంబంధించి సాలూరు, పాచిపెంట మండలాల్లో మరి కొందరు ప్రమేయం ఉన్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.



గంజాయి మూలాలు సాలూరులోనూ ఉన్నట్టు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. ఇటీవల కాలంలో పెరిగిపోయిన గంజాయి రవాణా విషయంలో పోలీసులు ఆరా తీస్తున్న కొద్దీ వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి.

ఆధార్‌కార్డు ఇవ్వడమే తప్పయింది

బంగారమ్మ కాలనీలో ఉన్న నా ఇంట్లో అద్దెకు దిగిన మార్వాడీ వ్యక్తి(ఇక్కడ కృష్ణ అని పిలుస్తుంటారు) తనకు ఇక్కడ ధ్రువపత్రాలు లేవని మీ ఆధార్ కార్డు ఇస్తే సిమ్ తీసుకుంటామని చెప్పారు. మానవతా దృక్పథంతో ఆధార్ కార్డును ఇచ్చాను. అదే నేను చేసిన తప్పుగా మారింది. ప్రత్యేక పోలీసు అధికారులకు జరిగిందంతా చెప్పాను. నా ఆధార్ కార్డు నెంబరుతో సిమ్‌ను వాడుతున్న వ్యక్తిని సాలూరు పట్టణంలో ప్రత్యేక బృంద పోలీసులకు చూపించాను. ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

–కనకాల ఆనందరావు, దండిగాం గ్రామస్తుడు

ఉదయాన్నే ఇంటికి వచ్చారు

శుక్రవారం ఉదయం నా ఇంటికి నలుగురు వ్యక్తులు ఓ వాహనంలో వచ్చారు. తాము సిట్ అధికారులమని, గ్రామానికి చెందిన కనకాల ఆనందరావును పిలిపించమని కోరారు. ఆనందరావును తీసుకురాగా వారు విషయం చెప్పారు. సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

–గొర్లె రాజారావు, సర్పంచ్ ప్రతినిధి.

హోంకు చేరిన తప్పిపోయిన బాలుడు



బాలుడిని హోం నిర్వాహకులకు అప్పగిస్తున్న చైల్డ్‌లైన్ సభ్యులు

విజయనగరం ఫోర్ట్: హోం నుంచి తప్పిపోయిన బాలుడిని చైల్డ్‌లైన్ 1098 సంస్థ సభ్యులు తిరిగి హోంకు చేర్చారు. వివరాల్లోకి వెళ్తే...గజపతినగరంలోని బ్రెటర్ ఫ్యూచర్ హోంలో చదువుతున్న ఎనిమిదేళ్ల బాలుడు శనివారం ఉదయం విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా హెల్ప్ డెస్క్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు గుర్తించి చైల్డ్‌లైన్ సభ్యులకు అప్పగించారు. చైల్డ్‌లైన్ సభ్యులు కార్యాలయానికి తీసుకువెళ్లి బాలుడిని బాలల సంక్షేమ కమిటీ ముందు ప్రవేశపెట్టారు. కమిటీ ఆదేశానుసారం బాలుడిని హోం నిర్వాహకులకు అప్పగించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ కమిటీ సభ్యులు మురళీకృష్ణ, చైల్డ్‌లైన్ ప్రతినిధులు గణేష్, జి.ఎస్.వి.కృష్ణారావు, రమణమ్మ, రంజిత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించకపోతే చర్యలు : పీడీ



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ రాబర్ట్స్

విజయనగరం ఫోర్ట్: సమయ పాలన పాటించకపోతే చర్యలు తప్పవని ఐసీడీఎస్ పీడీ ఏఈ రాబర్ట్స్ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాలను నిర్వహించాలన్నారు. సమయ పాలన పాటించని వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మధ్యాహ్న భోజనానికి ఎంతమంది గర్భిణుల, బాలింతలు వస్తే అంతమంది హాజరు మాత్రమే వేయాలన్నారు. ఎక్కువగా వేస్తే ఊరుకునేది లేదన్నారు. అంగన్‌వాడీ ప్రీ స్కూలును సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న చిల్డ్రన్ హోంను పరిశీలించారు. సమావేశంలో సీడీపీఓ శ్రీదేవి, సూపర్‌వైజర్లు సుభాషిని, మణికేసరి తదితరులు పాల్గొన్నారు.

గంటన్నర పాటు నిలిచిన పాసింజర్ రైలు

సీతానగరం(పార్వతీపురం): రాయగడ నుంచి విశాఖపట్నం వెళ్లాల్సిన 227 నంబరు గల పాసింజరు ట్రైన్ గంటన్నర కాలం శనివారం సాయంత్రం సీతానగరం రైల్వేస్టేషన్ సమీపంలో నిలిచిపోయింది. రాయగడ నుంచి విశాఖపట్నం వెళ్లే 227 నెంబరు గల పాసింజరు ట్రైన్ సీతానగరం శనివారం సాయంత్రం 6 గంటలకు చేరుకుంది. ఇక్కడి నుంచి 6గంటల 10 నిమిషాలకు బయలుదేరాల్సిన ట్రైన్ ఇంజన్ మరమ్మతులకు గురవడంతో స్టేషన్‌కు సమీపంలో పాసింజరు నిలిచిపోయింది. దీంతో మెకానిక్ వచ్చి ఇంజిన్‌ను పరిశీలించినప్పటికీ ఉపయోగం లేకపోయింది. ఈ మేరకు ప్రత్యామ్నాయంగా వేరొక ఇంజిన్ తెచ్చి తగిలించడంతో రాత్రి 7 గంటల 30 నిమిషాలకు వెళ్లింది. దీంతో గంటన్నర ఆలస్యంగా బయలుదేరింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

రెసిడెన్షియల్ కాలేజ్ ప్రిన్సిపాల్ సస్పెన్షన్

విజయనగరం కంటోన్మెంట్: నెల్లిమర్ల ఏపీ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ఎ.నీలిమ అనే విద్యార్థిని ఇటీవల జ్వరంతో మృతి చెందిన ఘటనకు బాధ్యుల్ని చేస్తూ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జివి.రమాదేవిని ఆ సంస్థకు సరెండర్ చేసిన విషయం తెల్సిందే. తాజాగా కలెక్టర్ ఈ ఘటనపై ఇచ్చిన నివేదికను ఆధారంగా చేసుకుని గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి కల్నల్ వి రాములు ఆమెను సస్పెండ్ చేసినట్టు రెసిడెన్షియల్ పాఠశాలల జిల్లా కో–ఆర్డినేటర్ బి చంద్రావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె స్థానంలో అదే గురుకులం సివిక్స్ అధ్యాపకురాలు కె.శ్రీదేవికి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. పార్ట్ టైం ఆరోగ్య పర్యవేక్షకురాలు వై.నాగమణి, హౌస్ టీచర్ బివి.విష్ణుప్రియలను కలెక్టర్ విధుల నుంచి ఇప్పటికే తొలగించారని వివరించారు.

కొమరాడ ఎంపీడీఓ సస్పెన్షన్

విజయనగరం ఫోర్ట్: కొమరాడ ఎంపీడీఓ విజయలక్ష్మిని కలెక్టర్ వివేక్ యాదవ్ శనివారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కొమరాడ మండలంలో మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టకుండానే ఓ సంస్థకు నిధులు ఇచ్చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే వీటిని ఎంపీడీఓ పర్యవేక్షణ చేయలేకపోయారు. దీంతో ఆమెను సస్పెండ్ చేశారు. ఈ విషయంపై జిల్లా పరిషత్ సీఈఓ అనిత వద్ద సాక్షి ప్రస్తావించగా సస్పెండ్ చేసిన మాట వాస్తవమేనన్నారు.

గ్రామాల్లో మీసేవ కేంద్రాలు

- జేసీ శ్రీకేష్ బి. లఠ్కర్



విజయనగరం గంటస్తంభం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామ పంచాయతీలో మీసేవ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు సంయుక్త కలెక్టర్ శ్రీకేష్ బి. లఠ్కర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, కామన్ సర్వీస్ సెంటర్స్ 2.0 ప్రాజెక్ట్‌లో భాగంగా మీసేవ కేంద్రాలు లేని గ్రామ పంచాయతీల్లో సెంటర్ల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారు అర్హులని తెలిపారు. జిల్లా యాజమాన్యం నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి కేంద్రం మంజూరు చేయనున్నట్లు చెప్పారు.పూర్తి వివరాలు విజయనగరం ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

గరివిడి(చీపురుపల్లి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు అందించిన సమాచారం మేరకు పట్టణంలోని శ్రీవెంకటేశ్వర కోవెల వద్ద ఐదేళ్లుగా భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న మెరకముడిదాం మండలం భైరిపురం గ్రామానికి చెందిన తడేల దాలమ్మ (62)ను శనివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో విజయనగరం–పాలకొండ ప్రధాన రహదారిలో స్టేట్ బ్యాంక్‌కు ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం ఆమె కుమారుడు సీతంనాయుడుకు మృతదేహాన్ని అప్పగించారు.

పిల్లలతో పని చేయడం సంతృప్తినిచ్చింది

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

విజయనగరం ఫోర్ట్: ఆరేళ్ల పాటు పిల్లలతో పని చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు కేసలి అప్పారావు అన్నారు. స్థానిక కేసలి సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2011 నుంచి 2014 వరకు బాలల సంక్షేమ కమిటీ జిల్లా సభ్యునిగా పని చేశానన్నారు. 2014 నుంచి 2017 ఆగస్టు 25 వరకు బాలల సంక్షేమ కమిటీ చైర్మన్‌గా పని చేశానని తెలిపారు. ఈ ఆరేళ్ల కాలంలో వీధిబాలలు, భిక్షాటన, బాల కార్మికులు, అనాథ పిల్లల వంటి వారితో పనిచేయడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యునిగా ఎంపికైన కారణంగా జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా చేశానని చెప్పారు. రాష్ట్ర సభ్యునిగా చైర్మన్, ఇతర సభ్యుల సహకారంతో రాష్ట్రంలో ఉన్న పిల్లల సంక్షేమానికి, వారి హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

కన్నతల్లిని ఆదరించారు...

- డీఎస్పీ కౌన్సెలింగ్‌తో...

సాక్షి ఎఫెక్ట్..



కౌన్సెలింగ్ చేస్తున్న పార్వతీపురం డీఎస్పీ త్రినాథ్

సాలూరు: కన్నతల్లిని ఇంటి నుంచి గెంటేసిన కొడుకులు, కోడళ్లు పోలీసుల కౌన్సెలింగ్‌తో తిరిగి తమ ఇంటికి తీసుకువెళ్లారు. ఈ నెల 25న సాక్షి మెయిన్ ఎడిషన్‌లో 'కన్నతల్లిని గెంటేశారు' శీర్షికన ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. పట్టణంలోని రామా కాలనీకి చెందిన సోదావలి లక్ష్మిని తన చిన్నకొడుకు, కోడలు ఇంటి నుంచి బయటకు గెంటేసి, ఇంటికి తాళంవేసి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. దీంతో స్ఫూర్తి మహిళా మండలి సభ్యులు ఆమెను అక్కున చేర్చుకున్నారు. విషయం సాక్షిలో ప్రముఖంగా ప్రచురితం కావడంతో స్పందించిన పార్వతీపురం డీఎస్పీ త్రినాథ సాలూరు సర్కిల్ కార్యాలయానికి వచ్చి, సీఐ సంజీవరావుతో కలిసి లక్ష్మి పెద్దకుమారుడు, కోడలు శ్రీను, రామలక్ష్మి, చిన్నకుమారుడు, కోడలు రాజు, రాజేశ్వరిని పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. తల్లిదండ్రులను గెంటేయడం, పాపామే కాకుండా, చట్టరీత్యా నేరమన్నారు. అలాగే మీరు కూడా వృద్ధులౌతారని, అపుడు మీ బిడ్డలు మిమ్మల్ని గెంటేస్తే మీ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి దుందుడుకు చర్యలకు పాల్పడితే చట్టరీత్యా శిక్షార్హులౌతారని హెచ్చరించారు. దీంతో వారు లక్ష్మిని చక్కగా చూసుకుంటామని హామీ ఇచ్చి, ఇంటికి తీసుకువెళ్లారు.

స్ఫూర్తికి అభినందనలు

ఈ సందర్భంగా డీఎస్పీ త్రినాథ్‌తో పాటు సాలూరు సీఐ సంజీవరావు స్ఫూర్తి మహిళా మండలి అధ్యక్షురాలు బలగ రాధను ప్రత్యేకంగా అభినందించారు. వృద్ధుల సేవలకు పోలీసు శాఖ కూడా చర్యలు చేపట్టిందని, అదే తరహాలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోన్న స్ఫూర్తి మహిళా మండలి సేవలు ఆదర్శప్రాయమన్నారు.

జైజై గణ

జిల్లాలో గణపతి పూజలు శుక్రవారం వేడుకగా జరిగా
ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తి శ్రద్ధలతో వి
విద్యుత్ దీపాలతో మండపాలను సుందరంగా అలంక
విగ్రహాలను తిరువీధి జరిపి నిమజ్జనం చేశారు. వినా
సందడి నెలకొంది.




తోటపాలెంలో కాంతులతో మెరిసిపోతున్న మండపాలు


విజయనగరం ఆసుపత్రి రోడ్డులో ఆకర్షించే సెట్


బాలాజీ మార్కెట్‌లో విద్యుత్‌కాంతులతో రాధాకృష్ణులు


ఎన్‌సీఎస్ రోడ్డులో వినాయక సెట్


రింగ్‌రోడ్డు జొన్నగుడ్డిలో చాక్లెట్ వినాయకుడు


బాలాజీ మార్కెట్‌లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం


విజయనగరం ఎన్‌సీఎస్ రోడ్డులో గజేంద్రులపై కొలువుదీరిన గణనాథుడు


పార్వతీపురం బాలాజీథియేటర్ వద్ద శ్రీత్రిమూర్తి త్రిశక్తి సహిత మహాకైలాస గహ్వర ప్ర


విజయనగరం వైఎస్సార్ సర్కిల్ రోడ్డులో ఎలుక వాహనంపై గణపతి


విజయనగరం అరుంధతీనగర్‌లో బాహుబలి-2 వినాయకుడు


విజయనగరం యాతవీధిలో రాయల్‌ఫోర్ట్ సెట్


బలిజిపేట మెట్టవీ
కొలువైన లక్ష్మీగణ


నెల్లిమర్ల: రామతీర్థం జంక్షన్ ఎస్సీకాలనీలో నిర్మించిన గుహ మండపం


గాడిఖానా రైల్వే స్టేషన్‌లో రాక్షసునిపై గణపతి


గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్ పేటలో కొలువుదీరిన చింతపిక్కల వినాయకుడు


విజయనగరం బాలాజీ మార్కెట్‌లో కొలువు తీరిన గణపతి


రైల్వే ఓల్డ్ కాలనీలో తబలా సెట్



ేశా..

యి. భక్తులు వివిధ రూపాల్లో ఉన్న విగ్రహాలను
నాయక వ్రతాలు నిర్వహించారు. భారీ సెట్‌లు,
రించారు. పలు చోట్ల మొదటి రోజే వినాయక
యక పూజలతో విద్యలనగరంలో ఆధ్యాత్మిక

– సాక్షి నెట్ వర్క్
ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



విజయనగరం వైఎస్సార్ సర్కిల్ వద్ద ఆకర్షించే సెట్



విజయనగరం భాగ్యశ్రీ అపార్ట్‌మెంట్‌లో భారీ వినాయక విగ్రహం



మర గణపతి విగ్రహం



రైల్వే ఓల్డ్ కాలనీలో శివుని చేతిలో గణపతి



కణపాక రోడ్డులో కోట సెట్‌లో కొలువుదీరిన వినాయకుడు



రైల్వే కాలనీలో పూజలందుకుంటున్న గణనాథుడు



కె.ఎల్.పురంలో వెంకటేశ్వరస్వామి ఆలయం సెట్

లో
పతి



గాడిఖానా రైల్వే స్టేషన్ రోడ్డులో స్వచ్ఛభారత్ సెట్



వీటీ అగ్రహారంలో భారీ సెట్



రైల్వే ఓల్డ్ కాలనీలో పొదల్లో అమ్మవారి ఆకారంలో విగ్రహం



బాలాజీ మార్కెట్‌లో వినాయకుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

సేవల్లో పురుషోత్తముడు

- సేవే పరమావదిగా ముందుకు సాగుతున్న ఉపాధ్యాయుడు
- పేదలను ఆదుకుంటున్న వైనం
- అమ్మా సేవా సొసైటీ ప్రతినిధిగా ఎనలేని సేవ



కథల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అప్పటి డీఈవో సుబ్బారావు

ఆయన వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు.. ప్రవృత్తి సేవ చేయడం. విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యను బోధించడమే కాదు.. పేద పిల్లలకు సొంత డబ్బులతో పుస్తకాలు, దుస్తులు అందజేస్తారు. ప్రతిభ చూపే విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తారు. దాతల సాయంతో చదువుకు కావాల్సిన సదుపాయాలు సమకూర్చుతారు. ఆయన ఎక్కడ పనిచేసినా ఆ గ్రామంలో శత శాతం అక్షరాస్యత నమోదుకావాల్సిందే. దీనికోసం గోడలపై అక్షరాలు రాయించి నిరక్ష రాస్యులకు బోధిస్తారు. అందుకే.. ఆయనను అవార్డులు వరిస్తున్నాయి. సేవలకు ప్రశంసల జల్లు కురుస్తోంది. గుర్ల మండలంలోని భూపాల పురం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న అల్లం పురుషోత్తమరావు సేవలను ఓ సారి పరికిస్తే...

గుర్ల: ఎవరైనా ఆపదలో ఉన్నా.. చదువులో ప్రతిభ చూపే విద్యార్థులు ఉన్నత చదువుల కోసం డబ్బు సమస్య ఎదుర్కొంటున్నారని తెలిసినా గుర్ల మండలంలోని భూపాలపురం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న అల్లం పురుషోత్తమరావు చలించిపోతారు. పేదలకు సాయం చేస్తారు. విద్యార్థులకు చదువుకు కావాల్సిన ఆర్థిక సాయం అందజేస్తారు. ఆయన బోధన కూడా వినూత్నంగా ఉంటుంది. పాఠ్యాంశాలను ప్రయోగాత్మకంగా వివరిస్తారు. వ్యాసరచన, వక్తృత్వ, క్రీడా పోటీలు నిర్వహించి విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నారు. క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు.

శతశాతం అక్షరాస్యత కోసం..

ఆయన ఏ గ్రామంలో పనిచేసినా అక్కడి వారంతా అక్షరాస్యులు కావాల్సిందే. దీనికోసం వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని గోడలను నల్లబలలుగా మార్చి అక్షరాలు, గుణింతాలు, ఎక్కాలు, సామెతలు, ఆంగ్ల అక్షరమాలను రాయిస్తున్నారు. వాటిని ప్రతి రోజు పిలలతో నిరక్షరాస్యులకు బోధించేలా చేస్తున్నారు. ఆయన ఎక్కడ పనిచేసినా ఆగ్రామంలోను, లేదంటే సమీపంలో నివసిస్తారు. పాఠశాల, గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తారు.

ప్రయోగాలతో ఆసక్తి..

మైక్రోస్కోపు, టెలిస్కోప్, ఆక్సిజన్ తయారీ, కార్బన్ డైయాక్సైడ్ తయారు చేసే విధానాలను విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించి సైన్స్‌పై ఆసక్తి పెంచుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని బడికి వచ్చే పిల్లలకు పౌష్టికాహార సమస్యతో బాధపడుతున్నట్టు గుర్తించి మధ్యాహ్న భోజనంలో సొంత డబ్బులతో గుడ్లు వడ్డిస్తున్నారు. రెండు వందల మంది విద్యార్థులకు నెలలో ఎనిమిదిసార్లు గుడ్లు పంపిణీ చేస్తున్నారు.

'అమ్మ' సేవా సొసైటీ సహాయంతో ...

ఏటా రెండు ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి 20 మంది నిరుపేద, ప్రతిభ గల విద్యార్థులకు ఐదు సంవత్సరాల ఉన్నత చదువు చదువుకునేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు. యూనిఫారాలు, పుస్తకాలు, మెస్ చార్జీలు, కళాశాల రుసుములు, పరీక్ష ఫీజులు, బస్సు పాసులకయ్యే ఖర్చులన్నీ వారే భరిస్తారు. అమ్మ సేవా సొసైటీ నుంచి నాలుగు కళాశాలల నుంచి 60 మంది విద్యార్థులకు ఆర్థిక సహాయం అందేలా ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

సేవలకు అవార్డుల వరద

- 2007లో జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు
- 2007లో మదర్ థెరిసా సేవా సంస్థ తరపున సేవా రత్న అవార్డు
- 2007లో కనకమహాలక్ష్మి కల్చరల్ అండ్ సోషల్ వెల్ఫేర్ వారి మేన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు
- 2007లో అనురాధ మెమోరియల్ సొసైటీ తరపున గురుదేవోభవ లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంటు అవార్డు
- 2007లో గురుబ్రహ్మ అవార్డు
- 2008లో ఉగాది పురస్కారం

చదువుకు సాయం చేయడమే లక్ష్యం..



చదువులో ప్రతిభ చూపే పేద విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఆర్థిక కష్టాలు పడరాదనే అమ్మ సొసైటీ తరపున సేవలందేలా చూస్తున్నాను. సమాజసేవకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలి. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి. విద్య, వైద్యం కోసం పేదలకు సాయమం చేయాలి. అనాథ శవాల దహన సంస్కారాలకు చొరవచూపాలి. – అల్లం పురుషోత్తమరావు

విజయనగరం | ఆదివారం | ఆగస్టు | 27 | 2017 సాక్షి

కార్గో సేవలకు.. సర్వం సిద్ధం..



కాంప్లెక్స్ ఆవరణలో ఖాళీ చేసిన ఏఎన్ఎల్ పార్శిల్ లోడింగ్ కార్యాలయం

డీలక్స్, సూపర్ లగ్జరీ సర్వీసులో...

నెక్ రీజయన్‌కు కొత్తగా వచ్చిన సుమారు 60 డీలక్స్, సూపర్ లగ్జరీ సర్వీసు అద్దె బస్సులు (రానున్నవి కలుపుకొని) రాకపోకలు చేస్తున్నాయి. వీటన్నింటిలోనూ సరకు రవాణా చేసేందుకు నిర్ణయించుకున్నారు. ప్రయాణికులకు ఇబ్బంది కల్గకుండా ఈ బస్సుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. లగ్జరీ బస్సులకు క్యారియర్ బాక్సును (డిక్కీ) ఏర్పాటు చేస్తారు. పల్లె వెలుగు బస్సులకు టాపుపైన రవాణాకు అనువైన ఏర్పాట్లు చేయనున్నారు.

చెల్లింపులు ఇలా...

వస్తు రవాణా సేవలను కొరియల్, పార్శిల్ రవాణాలుగా విభజించారు. కొరియర్ చెల్లింపుల్లో 500 గ్రాములు 200 కిలోమీటర్ల వరకు రూ.30, 200 కిలోమీటర్ల పైన రూ.35, 400 కిలో మీటర్లకు రూ.50గా నిర్ణయించారు. పార్శిల్ రవాణాకు సంబంధించి 50 కిలోలకు 100 కిలోమీటర్ల వరకు రూ.55, 200 కిలోమీటర్ల వరకు రూ.100, 300 కిలోమీటర్ల వరకు రూ.120, 400 కిలోమీటర్ల వరకు రూ.150 వసూలు చేస్తున్నారు.

సేవలు సులభతరం..:

కార్గో సేవలు సులభతరం కావడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు సైతం ఆ సేవల వైపు మొగ్గు చూపుతున్నారు. ధరలు కూడా అన్ని వర్గాలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. పార్శిల్ చేసిన వ్యక్తికి సర్వీసు నంబర్, డ్రైవర్ నంబర్ ఇవ్వడం వినియోగదారుల్లో నమ్మకం పెంచుతోంది. రాయితీల వల్ల కార్గో సేవలు వినియోగించే వారి సంఖ్య రోజుకోజుకూ పెరుగుతోంది.

ప్రైవేటు సంస్థలతో పోల్చుకుంటే తక్కువ ధరకే..

ప్రైవేటు కొరియర్ సంస్థలు 500 గ్రాముల బరువున్న పార్శిల్‌కు 100 కిలోమీటర్ల వరకు రూ. 40 తీసుకుంటున్నాయి. ఆర్టీసీ వారు రూ. 30 వసూలు చేయనున్నారు. 200 కిలోమీటర్ల వరకు కొరియర్ పార్శిల్‌కు రూ.57 వసూలు చేస్తుండగా ఆర్టీసీ రూ.30 తీసుకుంటుంది. 50 కిలోల పార్శిల్‌కు ఆర్టీసీలో రూ.55 తీసుకుంటుండగా ప్రైవేటు సంస్థలు రూ.175 తీసుకుంటున్నట్లు సమాచారం. ఒకే సారి టన్ను బరువు వరకు రవాణా చేసే వారికి ఆర్టీసీ మరింత ప్రోత్సాహం అందించనుంది. దూర ప్రాంతాలకు సరకులు రవాణా చేసిన వారికి ఆర్టీసీ చవకైన అవకాశాన్ని అందిస్తోంది. కిలో మీటరుకు రూ.2 చొప్పున చార్జి వసూలు చేయనుంది. ప్రైవేటు రవాణా సంస్థలు కిలోమీటరుకు రూ.4 నుంచి రూ.5 వరకు వసూలు చేస్తున్నట్లు ఆర్టీసీ వర్గాలు తెలిపాయి.

- ❖ ఆర్టీసీలో ఏఎన్ఎల్ పార్శిల్ సేవలకు చెల్లుచీటి
- ❖ ఆదివారం నుంచి సంస్థ సొంత కార్గో సేవలు పూర్తి స్థాయిలో ప్రారంభం
- ❖ ప్రయివేటు సంస్థలతో పోలిస్తే తక్కువ ధరలు
- ❖ ఆదాయం పెరిగితే చార్జీల భారం ఉండదంటున్న అధికారులు

విజయనగరం అర్బన్: నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న ఆర్టీసీ సంస్థను వస్తు రవాణా (కార్గో) సేవలతో ఒడ్డుకు చేర్చే ప్రయోగం సిద్ధమవుతోంది. నష్టాలను తగ్గించేందుకు చేస్తున్న అన్వేషణలో తాజాగా కార్గో సేవలు వచ్చి చేరాయి. ప్రయాణికుల సర్వీస్ మాదిరిగానే లగేజీ రవాణా సేవలను కూడా నిర్వహించాలని నిర్ణయించి ఏడాది క్రితం నుంచి ఈ విభాగాన్ని నిర్వహిస్తుంది. అయితే సంస్థలో ఈ సేవల విభాగాన్ని ప్రత్యేక ఒప్పందంతో ఏఎన్ఎల్ కొరియర్ సర్వీసు సంస్థ ఇప్పటికే 30 ఏళ్లుగా నిర్వహిస్తుంది. సంస్థ కాంప్లెక్స్‌ల పరిసరాల్లో లోడింగ్ అన్‌లోడింగ్ షెడ్‌లను ఏర్పాటు చేసుకొని ఏఎన్ఎల్ ఈ సేవల వ్యాపారం చేస్తుంది. ఏఎన్ఎల్ సంస్థతో ఒప్పందాన్ని చట్టబద్ధంగా తెగతెంపులు చేసుకొని ఏడాదిలోగా ఖాళీ చేసుకోవాలని ఆదేశిస్తూ ఏడాది క్రితం నుంచి సమాంతరంగా కార్గో సేవలను ఆర్టీసీ సంస్థ అందిస్తుంది. ఏఎన్ఎల్ సంస్థతో ఒప్పందం గడువు ఈ నెల 25తో ముగిసింది. ఒక రోజు గ్రేస్ పిరియడ్‌గా ఇచ్చి శనివారంతో పూర్తిగా ఖాళీ చేయాలని ఏఎన్ఎల్‌కు నోటీసులు పంపారు. దీంతో ఆర్టీసీ సంస్థ పూర్తి స్థాయిలో కార్గోసేవలను ఆదివారం నుంచి నిర్వహించడానికి సన్నద్ధమైంది.

ఆదాయం పెరిగితే చార్జీల భారం తగ్గుదల..

సంస్థకు ఆదాయం పెరిగితే చార్జీల భారం పెంచే పరిస్థితి ఉండదు. కొత్తగా సరకు రవాణా బస్సుల ద్వారా సంస్థకు కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో జూన్ 1 నుంచి ఈ సేవలను ప్రారంభించాం, తాజాగా ఆదివారం నుంచి పూర్తి స్థాయిలో నిర్వహిస్తున్నాం. మంచి స్పందన వస్తోంది. ఆర్టీసీకి ఆదాయం వస్తే ప్రయాణికులపై అదనపు భారం ఉండదు. మా సంస్థల్లో సరకు రవాణా చార్జీలు ఇతర ప్రైవేటు సంస్థలతో పోలిస్తే చాలా తక్కువ. కొత్తగా మాకు అందుబాటులోకి రానున్న బస్సుల్లో కూడా నిర్వహించనున్న ఈ సేవల్ని ప్రజలు సద్వినియోగం చేసకోవాలి.

- ఎం.సన్యాసిరావు, మేనేజర్, పార్శిల్ విభాగం, ఆర్టీసీ విజయనగరం డిపో

కోట్లు నష్టపోయిన ఆర్టీసీ..

గత ఏడాది జూన్‌లో ఏఎన్ఎల్‌కి సమాంతరంగా నిర్వహించిన ప్రయోగాత్మక కార్గో సేవల ఆదాయాన్ని పరిశీలిస్తే ఆర్టీసీ సంస్థ ఇంత వరకు ఏడాదికి రూ.కోట్లలో ఆదాయాన్ని కోల్పోయింది. నెక్ రీజియన్ పరిధిలో 9 డిపోల ఆదాయాన్ని పరిశీలిస్తే గతేడాది జూన్ నుంచి ఇంత వరకు నెలకు సరాసరి రూ.9 లక్షలు తెచ్చుకుంది. కార్గో వ్యాపార వనరులు అతి తక్కువ ఉన్న రీజియన్‌గా నెక్‌ని సంస్థ గుర్తించింది. మిగిలిన 11 రీజియన్లలో భారీగా ఆదాయం సాధించారు. నెలకు సరాసరి ఒక్కో రీజియన్‌కి రూ.3 కోట్ల ఆదాయం తెచ్చుకున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

ఈ లెక్కన ఏడాదికి ఆర్టీసీ సంస్థకు రూ.36 కోట్ల మేరకు ఆదాయం వచ్చింది. 30 ఏళ్ల క్రితం పెట్టుకున్న ఒప్పందం మేరకు ఏడాదికి ఏఎన్ఎల్ సంస్థ నుంచి వచ్చిన కాంట్రాక్ట్ నిధి కేవలం రూ.9 కోట్లు మాత్రమే. ఏఎన్ఎల్ సంస్థ వ్యాపారం చేస్తున్న సమయంలో సమాంతరంగా చేసిన కార్గో సేవలకే ఇంత ఆదాయం వస్తే పూర్తిగా సంస్థే నిర్వహిస్తే మరింత ఆదాయం వస్తుందని అధికారులు సంబరపడుతున్నారు.

గిరిజనులకు ఉపాధి కల్పించేందుకే..



వలల అల్లికపై పోటీలు నిర్వహిస్తున్న మత్స్య శాఖ అధికారులు

గరుగుబిల్లి (కురుపాం) : గిరిజనులకు ఉపాధిని కల్పించేందుకే చేపలు పట్టడం, వలల అల్లికపై శిక్షణ ఇస్తున్నామని మత్స్యశాఖ ఏడీ కోటేశ్వరరావు తెలిపారు. శనివారం గరుగుబిల్లి మండలంలోని తోటపల్లి ప్రాజెక్టు కుడి మట్టి కట్ట ప్రాంతంలో గిరజన యువతకు వలల అల్లికలు, ఈత కొట్టడం, వల విసరడంపై పోటీలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ తోటపల్లి ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాల్లో 200 మంది గిరిజన యువతకు శిక్షణ ఇచ్చేందుకు గానూ ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో 72 మంది మత్స్యకారులకు రూ.30 వేల విలువ చేసే తెప్పలు, వలలు, లైఫ్ జాకెట్లు సరఫరా చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులు కేవలం 20 శాతం మాత్రమే చెల్లిస్తే సరిపోతుందని వివరించారు. కార్యక్రమంలో ఆ శాఖ ఏడీ దివాకర్, డీడీ కనకరాజు, ఎఫ్‌డీఓ మురళి పాల్గొన్నారు.

జిల్లాకు ఐదుగురు ప్రో డీటీలు

విజయనగరం గంటస్తంభం: జిల్లాకు ప్రభుత్వం ఐదుగురు ప్రో డీటీలను కేటాయించింది. ఈ మేరకు రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కార్యదర్శి (సీసీఎల్ఏ) ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో నలుగురు జిల్లాకు చెందిన వారు కాగా ఒకరు చిత్తూరుకు చెందిన వారు. గతంలో 1999లో ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్–2 పరీక్షల్లో తమకు అన్యాయం జరిగిందని కొందరు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కేసును విచారించిన హైకోర్టు ఎట్టకేలకు వారికి ఉద్యోగాలు ఇవ్వాలని తీర్పు వెలువరించింది. దీంతో వారికి ఉద్యోగాల్లోకి తీసుకున్న ప్రభుత్వం శాఖలు కేటాయించింది. ఇందులో భాగంగా పలువురు రెవెన్యూ శాఖను ఎంపిక చేసుకున్నారు. ప్రస్తుతం వీరిని ప్రోబేషన్ (శిక్షణ) డిప్యూటీ తహసీల్దార్లుగా నియమిస్తూ సీసీఎల్ఏ జిల్లాలు కేటాయించింది. ఇందులో జిల్లాకు ఎం.మురళీధర్, వి.వెంకటశర్మ , రావి దూశి, మాలతి సుధారాణి, వై.జయలక్ష్మి(చిత్తూరు) కేటాయించారు. ఈ జాబితా జిల్లా కలెక్టరుకు చేరింది. ఇందులో ఎవరు ఉద్యోగాల్లో చేరుతారో చూడాలి. ఇప్పటికే ఇద్దరు, ముగ్గురు వేరే ఉద్యోగాల్లో స్థిర పడడం కూడా వీరు చేరుతారా లేదా అన్నది సందిగ్ధంలో ఉంది.

పంచాయతీ కార్యాలయాలకు నిధులివ్వాలని డిమాండ్



మాట్లాడుతున్న మామిడి అప్పలనాయుడు తదితరులు

విజయనగరం మున్సిపాలిటీ : జిల్లాలో కార్యాలయాలు లేని పంచాయతీలకు భవనాల నిర్మాణం కోసం తక్షణమే నిధులు మంజూరు చేయాలని ఏపీ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షుడు మామిడి. అప్పలనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం విడుదల చేస్తున్న నిధులపై రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలు చేయడం తగదన్నారు. కేంద్రం ఆర్థిక సంఘం నిధులు, ఉపాధి నిధులను మ్యాచింగ్ చేస్తూ పంచాయతీ కార్యాలయాలు నిర్మించుకునేందుకు హామీ ఇచ్చినప్పటికీ నెరవేరలేదన్నారు. జిల్లాలో 921 పంచాయతీలకు గానూ 400 పంచాయతీలకు కార్యాలయాలు లేవని పేర్కొన్నారు. గతంలో ఈ విషయంపై మంత్రి సుజయ్‌కృష్ణకు వినతిపత్రం ఇచ్చినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంచాయతీ కార్యాలయాలకు నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు.

ఎయిర్‌పోర్టు పనుల వేగవంతానికి ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వివేక్ యాదవ్

విజయనగరం గంటస్తంభం: భోగాపురం ఎయిర్‌ఫోర్టుకు సంబంధించిన పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టరు వివేక్‌యాదవ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించిన భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. కలెక్టరేట్ తన ఛాంబరులో శనివారం భూసేకరణ, పునరావాస, పునర్మిర్మాణ పనులకు సంబంధించి రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విమానాశ్రయానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న 190 ఎకరాల భూసేకరణ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. భూ నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికి లే అవుట్ పనులు పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ ఎస్ఈ కాంతిమతిని ఆదేశించారు. భూసేకరణలో భోగాపురం మండలంలో నాలుగు గ్రామాలు పోతున్నందున వారికి పునరావాసం కల్పించడానికి గూడెపువలస, పోలిపల్లిలో ప్రభుత్వం కేటాయించిన భూముల్లో ఇళ్ల స్థలాలను లే అవుట్‌లుగా తీర్చిదిద్దడానికి చేపట్టిన చర్యలపై ఆయన ఆరా తీశారు. ఆశించిన ప్రగతి లేకపోవడంతో పోలిపల్లి లేఅవుట్ నాలుగు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. అర్అండ్‌బీ రూపొందించిన లే అవుట్‌ను మూడు నెలల్లో అభివృద్ధి పరచాలన్నారు. భూసేకరణలో గ్రామీణ నీటి సరఫరా పథకాలను తొలగించడానికి చేపట్టిన చర్యలు, ప్రత్యామ్నాయ పథకాల ఏర్పాటుకు అవసరమైన అంచనాలు, ఎయిర్‌ఫోర్టు పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణానికి, వ్యవసాయ, నీటిపారుదల, రోడ్లు – భవనాలు, విద్యుత్ తదితర శాఖల ప్రమేయంపై చర్చించారు. భూ సేకరణలో రికార్డులు పక్కాగా ఉండాలని పేర్కొన్నారు. సేకరించిన భూమిని సమగ్ర వివరాలతో ఎయిర్‌ఫోర్టు అథారిటీకి అప్పగించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జేసీ శ్రీకేష్ బి లత్కర్, ఆర్డీఓ శ్రీనివాసమూర్తి, ఎస్డీసీలు శ్రీలత, అనిత, త్రిపురసుందరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో కానరాని సౌకర్యాలు



విజయనగరం బీసీ కాలనీ అంగన్‌వాడీ ప్రీస్కూల్‌లో ఫ్యాన్లు లేక వరండాలో కూర్చున్న పిల్లలు

విజయనగరం ఫోర్ట్ : ప్రభుత్వం గతంలో అంగన్‌వాడీల్లో సకల సౌకర్యాలు కల్పిస్తామని ప్రకటించింది. కానీ నేటి వరకు చాలా కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. చాలా చోట్ల ఫ్యాన్లు ఏర్పాటు చేయలేదు. తాజా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ ప్రీ స్కూళ్లలో వీటి ఆచూకీ కానరాదు. దీంతో ఉక్కపోతతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో 17 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటిలో 2,987 అంగన్‌వాడీ, 742 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. సుమారు 300 కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం లేదు. 400 వరకు కేంద్రాల్లో ఫ్యాన్లు లేనట్లు సమాచారం. దీనిపై విజయనగరం ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.శ్రీదేవిని వివరణ కోరగా త్వరలోనే అన్ని కేంద్రాలకు విద్యుత్ సౌకర్యాన్ని కల్పించి, ఫ్యాన్లు ఏర్పాట్లు చేస్తామన్నారు.

వీఆర్ఏలకు పదోన్నతి..!

● ఫైల్ సిద్ధం చేస్తున్న కలెక్టరేట్ అధికారులు



కలెక్టరేట్

విజయనగరం గంటస్తంభం:

జిల్లాలో పని చేస్తున్న 17 మంది గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్యే)కు గ్రామ రెవెన్యూ అధికారులు(వీఆర్వో)గా పదోన్నతి కల్పించేందుకు కలెక్టరేట్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. కలెక్టర్ వివేక్‌యాదవ్ ఆదేశాల మేరకు కలెక్టరేట్ పరిపాలనాధికారి రమణమూర్తి ఫైల్ సిద్ధం చేస్తున్నారు. అర్హులైన తమకు పదోన్నతి కల్పించాలని వీఆర్యేలు ఎప్పటినుంచో అధికారులకు విన్నవిస్తున్నారు. దీనికి తోడు ఇటీవల జరిగిన రెవెన్యూ గ్రీవెన్స్ డే నాడు జిల్లా రెవెన్యూ సంఘ నాయకులు తాడ్డి గోవింద, పేడాడ జనార్దనరావు, ఇతర నాయకులు వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని కోరుతూ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ నేపథ్యంలో పదోన్నతుల కోటా కింద 17 మంది జాబితా సిద్ధం చేశారు. ఈ ఫైల్‌కు డీఆర్ఓ, జేసీ, కలెక్టర్ ఆమోదముద్ర వేయాల్సి ఉంది. ఒకటి, రెండురోజుల్లో వీరికి పదోన్నతి వచ్చే అవకాశం ఉందని కలెక్టరేట్ అధికారులు చెబుతున్నారు.

అయినా అనుమానమే..

పదోన్నతుల ఫైల్ కదలడంతో వీఆర్ఏలు ఒకవైపు సంతోషం వ్యక్తం చేస్తున్నా, లోలోపున మాత్రం అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో పదోన్నతులు, పోస్టింగుల ఫైళ్లు జాప్యం కావడమే ఇందుకు కారణం అని తెలుస్తోంది. సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతి కల్పించి నెల రోజులవుతున్నా ఆ ప్రక్రియ నేటికీ పూర్తికాలేదు. పదోన్నతి పొందిన వారందరూ నేటికీ సీనియర్ అసిస్టెంట్ వేతనమే పొందుతున్నారు. దీంతో రెవెన్యూలో పదోన్నతులు, పోస్టింగులు అంటే నమ్మలేని పరిస్థితిలు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల్లో వీఆర్ఏలకు పదోన్నతుల భాగ్యం ఎప్పుడు వేచి చూడాలి మరి.

కాకినాడ ఎన్నికల ప్రచారంలో చిన్న శ్రీను..



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న చిన్నశ్రీను, తదితరులు

విజయనగరం మున్సిపాలిటీ: కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ జిల్లా రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) బిజీగా ఉన్నారు. పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కొద్ది రోజులుగా అక్కడ ప్రచారం నిర్వహిస్తున్నారు. శనివారం కూడా స్థానిక నాయకులతో కలిసి పలు వార్డుల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని చెప్పారు.

సమస్యలెందుకు పరిష్కరించడం లేదు..

●లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ



గురజాడ గృహం వద్ద మాట్లాడుతున్న భీశెట్టి

విజయనగరం పూల్‌బాగ్: గురజాడ రచించిన కన్యాశుల్కం నవలకు 125 ఏళ్ల ఉత్సవం నిర్వహించడం అభినందనీయమే అయినప్పటికీ గురజాడ జయంతి, వర్ధంతుల సభల్లో పాలకులు ఇచ్చిన హామీలు, కుటుంబీకుల సమస్యలను పరిష్కరించకపోవడం దారుణమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఈ మేరకు పార్టీ కార్యకర్తలతో కలిసి గురజాడ నివాసం వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గురజాడ ఇంటిని మ్యూజియంగా మారుస్తామని చెప్పిన హామీ నేటికీ పరిష్కారం కాలేదన్నారు. గురజాడ కుటుంబీకుల నుంచి విలువైన స్థం తీసుకుని పిచ్చిమొక్కలతో ఉన్న స్థలం ఇచ్చారన్నారు. వెంటనే కుటుంబీకులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు టి. కోటేశ్వరరావు, పి. అప్పారావు, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

‘కబేళాలకు తరలకుండా చర్యలు’

విజయనగరం కంటోన్మెంట్: సెప్టెంబర్ 2న బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఆవులు కబేళాలకు తరలకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వివేక్‌యాదవ్ ఆదేశించారు. ఈ మేరకు శనివారం జిల్లా అధికారులకు సర్క్యులర్ జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జీఓ 532/1980 ప్రకారం ప్రభుత్వం గోవధను నిషేధించిందన్నారు. అలాగే జంతు పరిరక్షణ చట్టం–77 ప్రకారం ఆయా చట్టాల నిబంధనలు ఉల్లంఘించే వారికి ఆరు నెలల జైలు, రూ.వెయ్యి జరిమానా విధించే అవకాశం ఉందని చెప్పారు. ఆవులను తరలించకుండా నిరోధించేందుకు తగినన్ని చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని సూచించారు.

పైడితల్లి దీక్ష విశిష్టత చాటిచెప్పాలి..

●పైడితల్లి ఆలయ ఈఓ భానురాజా



ప్రచార రథం ప్రారంభిస్తున్న భానురాజా ,తదితరులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించే క్రమంలో భాగంగా అమ్మవారి విశిష్టతను దశదిశలా చాటిచెప్పేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ భానురాజా తెలిపారు. శనివారం స్థానిక మూడు లాంతర్ల వద్దనున్న అమ్మవారి చదురుగుడి ఆలయ ఆవరణలో పైడితల్లి దీక్ష ప్రచార రథాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా ప్రచార రథంలో ఉన్న పైడితల్లి ఉత్సవ విగ్రహానికి విశేష పూజలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఉత్తరాంధ్రలో పైడితల్లి దీక్షను విస్తృతపరిచేందుకు పైడితల్లి పీఠం ప్రతినిధులు ఆర్ఎస్.పాత్రో, అచ్చిరెడ్డి, ఉమ్మెద భాస్కరరావు తదితరులు వాడవాడలా ప్రచారం చేపడతారని చెప్పారు. ఈ ఏడాది వెయ్యిమంది భక్తులు అమ్మ దీక్ష చేపట్టే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, రామారావు, పెనుమత్స శ్రీనివాసరాజు, నలజాన కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

● కలెక్టర్ వివేక్‌యాదవ్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వివేక్‌యాదవ్

విజయనగరం పూల్‌బాగ్: ఎన్టీఆర్ గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వివేక్‌యాదవ్ ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో గృహ నిర్మాణ శాఖ ఇంజినీరింగ్ శాఖాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ, హౌసింగ్ పథకంలో జిల్లాలో ఆశించినంత ప్రగతి కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కొంతమంది సహాయ ఇంజినీర్లు స్పందిస్తూ లబ్ధిదారులు ముందుకు రావడం లేదని, కొండ శిఖర ప్రాంతాల్లో నిర్మాణాలు సమస్యగా మారాయని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ కొండశిఖర ప్రాంతాల్లో కూడా పాఠశాలలు, అంగన్‌వాడీ భవన నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తే నిర్మాణాలు బాగానే జరుగుతాయని సూచించారు. ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ 2016–17 కింద 10,900 గృహాలు మంజూరు కాగా 8,026 మాత్రమే గ్రౌండ్ అయ్యాయని, మిగిలిని త్వరితగతిన గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఎస్వీ రమణమూర్తి, ఈఈలు, డీఈఈలు, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు తేదీని మార్చండి...

●లోక్‌సత్తా పార్టీ

విజయనగరం పూల్‌భాగ్: నంద్యాల శాసనసభ ఉప ఎన్నికకు సంబంధించి లెక్కింపును ఈ నెల 28 నుంచి 30కి మార్చాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు ఈ మెయిల్ పంపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 29న కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 48 వార్డులకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నంద్యాల గెలుపోటముల ప్రభావం వాటిపై పడుతుందన్నారు. అందుకే లెక్కింపు వాయిదా వేయాలని కోరుతున్నట్లు చెప్పారు. సమావేశంలో పార్టీ నాయకులు ఎ. నాగభూషణం, సిమ్మ శ్రీను, టి. రాజారావు, శ్రీనివాస్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు అధికార దాహం

● వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర కన్వీనర్, ఎమ్మెల్సీ కోలగట్ల




మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర కన్వీనర్ , ఎమ్మెల్సీ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం మున్సిపాలిటీ: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అధికారం దాహం పట్టుకుందని, మూడున్నరేళ్లలో ప్రజా సమస్యలు పట్టించుకోని ఆయనకు ఓటమి భయం పట్టుకుందని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర కన్వీనర్, ఎమ్మెల్సీ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నంద్యాల ఉప ఎన్నికతో పాటు కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపుపై తాపత్రయం పడుతున్న చంద్రబాబు పాలనను గాలికొదిలేశారన్నారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటమి భయంతో వార్డుకో మంత్రిని నియమించి, అక్కడ ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు అధికారానికి, ప్రజాబలానికి మధ్య పోరుగా కోలగొట్ల పేర్కొన్నారు. ఏదిఏమైనా రెండోచోట్లా వైఎస్సార్‌సీపీ గెలుపు తప్పదని జోష్యం చెప్పారు. కర్నూలు ఉప ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీ తరుపున పోటీ చేసిన శిల్పా కుటుంబంపై టీడీపీ నాయకులు కక్ష గట్టారని ఆరోపించారు. శిల్పా కుటుంబానికి ఏం జరిగినా అందుకు ముఖ్యమంత్రే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ విజయనగరం పట్టణ అధ్యక్షుడు ఆశపు వేణు, మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బొద్దాన అప్పారావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సంగంరెడ్డి బంగారునాయుడు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు మారం బాలబ్రహ్మారెడ్డి, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి బోడసింగి, ఈశ్వరరావు, పాల్గొన్నారు.

ముద్రగడ పోరాటంలో ధర్మం..

● సాలూరు, రాజాం ఎమ్మెల్యేలు రాజన్నదొర, కంబాల జోగులు



ముద్రగడకు సంఘీభావం పలుకుతున్న ఎమ్మెల్యేలు రాజన్నదొర, జోగులు

సాలూరు/సాలూరు రూరల్/మెంటాడ: కాపులను బీసీలలో చేర్చాలన్న డిమాండ్‌తో ముద్రగడ పద్మనాభం చేస్తున్న పోరాటంలో ధర్మముందని సాలూరు ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర, రాజాం ఎమ్మెల్యే కె. జోగులు అన్నారు. తూర్పుగోదావరిలోని కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభంను శనివారం వారు కలిసి మద్దతు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, టీడీపీ ఎన్నికల సమయంలో కాపులను బీసీల్లో నేర్చుతామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు పూర్తవుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ముద్రగడ పోరాటం చేయాల్సి వచ్చిందని చెప్పారు. ముద్రగడ గాంధీ మార్గంలో పాదయాత్ర చేస్తామంటే ప్రభుత్వం ఎందుకు అడ్డుకుంటుందో అర్థం కావడం లేదన్నారు. రానున్న రోజుల్లో టీడీపీకి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. అనంతరం కాకినాడ 12వ వార్డులో ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి డోల బాబ్జీ, మెంటాడ నాయకులు కిలపర్తి మధు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరీసా ఆదర్శప్రాయం

- మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల



మున్సిపాలిటీ: మదర్ థెరీసా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

విజయనగరం మున్సిపాలిటీ/టౌన్ : సేవామూర్తి మదర్ థెరీసా ఆదర్శప్రాయురాలని మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కస్పా ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం, ఉపాధ్యాయ సిబ్బంది నిర్వహించిన మదర్‌థెరీసా జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా సరస్వతీదేవి విగ్రహానికి, అనంతరం థెరిస్సా విగ్రహాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు. అలాగే జనసేన సేవాదళ్ ఆధ్వర్యంలో కూడా జయింతి నిర్వహించారు. కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు బాలు, కె.లక్ష్మణ్, భరత్, అభిలాస్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– వాడవాడలా..

మదర్ థెరీసా జయంతి పట్టణంలో వాడవాడలా ఘనంగా జరిగాయి. గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్లో థెరీసా చిత్రపటానికి పూలమాల లేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే శ్రీవారధి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కూడా జయంతి నిర్వహించారు.

వీటీ అగ్రహారం పాఠశాలలో..

విజయనగరం అర్బన్: పట్టణంలోని వీటీ అగ్రహారం జిల్లా పరిషత్ పాఠశాలలో మదర్ థెరీసా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జీవిత చరిత్రపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు టి. నరసింహమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు నిర్వహించారు.

‘ఆగని దందా’పై విచారణ

విజయనగరం మున్సిపాలిటీ: మున్సిపాలిటీ పరిధిలో ఎన్టీఆర్ గృహ నిర్మాణాల బిల్లుల చెల్లింపులో ప్రతిసారీ లబ్ధిదారుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ వచ్చిన ఆరోపణలపై కలెక్టర్ వివేక్‌యాదవ్ స్పందించారు. ఈనెల 3న సాక్షిలో ‘ఆగని దందా’ శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ వ్యవహారంపై మూడు రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసి నివేదిక సమర్పించాలంటూ హౌసింగ్ పీడీ రమణమూర్తిని ఆదేశించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

విజయనగరం మున్సిపాలిటీ: విజయనగరం పట్టణంలో గల డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తుల నిమిత్తం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ విజయనగరం డీఈ జి.ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రదీప్‌నగర్ సగభాగం, వీటీ అగ్రహారం, బీసీకాలనీ, జిల్లా కోర్టు, పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

‘వారం రోజుల్లోగా ఉత్తర్వులు’

విజయనగరం కంటోన్మెంట్: మరుగుదొడ్ల నిర్మాణాల మంజూరు ఉత్తర్వులను వారంలోగా లబ్ధిదారులకు ఇవ్వాలని కలెక్టర్ వివేక్‌యాదవ్ ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మరుగుదొడ్ల నిర్మాణాలు శతశాతం జరగాలని, దీనికి మండల ఓడీఎఫ్ టీమ్‌లదే బాధ్యతన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అనిత, ఎన్ రమణమూర్తి, పాల్గొన్నారు.

సైనికుల సేవలు అజరామరం

విజయనగరం కంటోన్మెంట్: దేశ సమగ్రతను కాపాడుతున్న సైనికుల సేవలు అజరామరమని కేంద్రమంత్రి పి. అశోక్‌గజపతి రాజు అన్నారు. ప్రాణాలకు లెక్క చేయకుండా మన ప్రాణాలను కాపాడుతున్న సైనికుల సంక్షేమానికి బాలాజీ వాకర్స్ క్లబ్ రూ.1,11,111లను విరాళంగా అందజేశారు. దీనికి సంబంధించిన చెక్‌ను బాలాజీ వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి. సీతాలక్ష్మి, తదితరులు కేంద్రమంత్రి చేతుల మీదుగా పోస్టల్ ద్వారా ఆర్మీ వెల్ఫేర్ ఫండ్ బాటిల్ కాజువాలిటీస్‌కు పంపించారు. కార్యక్రమంలో సుబ్బరాజు, పీవీపీ రాజు, ఎర్నాయుడు, మోహనరావు, గణేష్, కృష్ణంరాజు, జీఎస్ఎన్ రాజు, శోభాలత, నాగలక్ష్మి, పద్మ, ఝాన్సీ, లత, తదితరులు పాల్గొన్నారు.

మహిళలతోనే ప్రగతి..

విజయనగరం మున్సిపాలిటీ: ప్రగతి రథానికి మహిళే చోదకశక్తి అని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ రాష్ట్ర కో ఆర్డినేటర్ టి.అరుణకుమారి అన్నారు. ప్రపంచ మహిళా సమానతా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎలియన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్–105 ఆధ్వర్యంలో శనివారం స్థానిక భాష్యం పాఠశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె మాట్లాడుతూ, మహిళే సృష్టికి మూలమన్నారు. లింగవివక్షతకు తావులేని అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. ప్రముఖ సాహితీవేత్త, రచయిత్రి టేకుమళ్ల విజయలలిత మాట్లాడుతూ నైతిక శక్తినే బలం అని బావిస్తే , పురుషుని కన్నా మహిళ ఎంతో ఉన్న స్థాయిలో ఉంటుందంటూ మహాత్మా గాంధీ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. ప్రముఖ గాయని ఎన్‌పీ.శారద మాట్లాడుతూ, మహిళల స్థాయిని చూసి ఒక దేశం పరిస్థితి ఎలా ఉందో చెప్పవచ్చుంటూ జవహర్ లాల్ నెహ్రూ చెప్పారని తెలిపారు. అనంతరం టి.విజయలలిత, ఎన్‌పీ.శారతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ వైస్ గవర్నర్ సముద్రాల గురుప్రసాద్, మహిళా చైర్‌పర్సన్ కె.విమలారాణి, జోన్ చైర్మన్ గోటేటి.హిమబిందు, వనితా క్లబ్ అధ్యక్షురాలు ఎం.సుభద్రాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీవీఎల్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



















1.ఎన్.జ్యోతిరమణ , ఉడాకాలనీ, విజయనగరం
2.వై.పవన్, బాబామెట్ట, విజయనగరం
3.డి.శివ లలిత్, విజయనగరం,
4.సైలాడ.సన్యాసిరావు, బీసీకాలనీ,
5.డీవీజీ శంకరరావు, మాజీ ఎంపీ విజయనగరం
6.ఎ.చందుకుమార్ , వైఎస్సార్‌నగర్‌కాలనీ , విజయనగరం
7.కంది నాక్షిత్, అఖిల , విజయనగరం
8.కందుల అఖిల్ , విజయనగరం

29న నిరసన దీక్ష

విజయనగరం అర్బన్: కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 29న స్థానిక కలెక్టరేట్ ఎదుట ఒక రోజు నిరసన దీక్ష చేపడతామని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) జిల్లా కమిటీ ప్రకటించింది. ఈ మేరకు శనివారం స్థానిక అమర్‌భవనంలో నిర్వహించిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దీక్షలో సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జోగారావు, ప్రధాన కార్యదర్శి డి.శ్యామ్, నాయకులు ఎస్ఎస్ దొర, మురళీ, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

న్యాయస్థాన తీర్పులపై సమీక్ష సమావేశం నేడు

విజయనగరం అర్బన్: విద్యారంగంలో 1978 – 1981 మధ్య నియమితులైన సెకండరీ గ్రేడ్ టీచర్లకు సంబంధించిన పలు అంశాలపై ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పులపై ఆదివారం స్థానిక జిల్లా కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులు ఈ సమావేశానికి హాజరై సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు.

మలేరియా నివారణకు చర్యలు

- సాక్షి ఎఫెక్ట్

విజయనగరం ఫోర్ట్: మలేరియా నివారణకు వైద్యాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల సాక్షిలో ‘మలేరియా ముప్పు’ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి వైద్యాధికారులు స్పందించారు.

గిరిజన ప్రాంతాల్లో మలేరియా వ్యాప్తి అధికంగా ఉందని, అందుకోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారి జి. ఉషశ్రీ తెలిపారు.

సాక్షి
విజయనగరం | ఆదివారం | ఆగస్టు | 27 | 2017

Portal Updates:
www.sakshieducation.com
→ IBPS PO & RRBs Officers Material and Online Practice Tests
→ IB ACIO Success tips, Material, Solved Papers & Online Tests
→ UPSC: CDS Exam (II) 2016 Final Result Released

విద్య
శ్రద్ధావాన్ లభతే జ్ఞానం

Sakshi Vidya Online Edition www.sakshieducation.com/Vidya.aspx
Send your Feedback to..sakshieducation@gmail.com

'ప్లానింగ్ అండ్ ద పూర్' గ్రంథ రచయిత?



బి. శ్రీనివాస్ పట్నాయక్
సబ్జెక్టు నిపుణులు
Sky wizards IAS academy, Visakapatnam

జనరల్ స్టడీస్
ఎకానమీ
ప్రత్యేకం



మాదిరి ప్రశ్నలు

1. చాలా సందర్భాల్లో ద్రవ్యోల్బణం వల్ల ఎక్కువ ప్రయోజనం పొందేవారెవరు?
1) పెన్షనర్లు 2) ఉద్యోగులు
3) వినియోగదార్లు
4) రుణగ్రస్తులు

2. నాబార్డ్ నేరుగా ఎవరికి అప్పు ఇస్తుంది?
1) చిన్న రైతులకు
2) గ్రామ చేతిపనివారికి
3) చిరు వ్యాపారులకు
4) పైవేవీకావు

3. మనదేశంలో నగరీకరణ పెరగడానికి కారణం?
1) నగరంలో పరిశ్రమలు, వ్యాపారం పెరగడం
2) గ్రామీణ ప్రాంతాల్లో అధిక జనాభా ఒత్తిడి
3) వ్యవసాయ రంగంలో అల్ప ఉత్పాదకత
4) పైవన్నీ

4. భారత్‌లో 'లక్ష్యం ప్రజాపంపిణీ విధానం (TPDS)'ను ఏ సంవత్సరం నుంచి అమలు చేశారు?
1) 1991 2) 1995
3) 1997 4) 2001

5. 20-పాయింట్ పథకాన్ని ఇందిరాగాంధీ ఏ సంవత్సరంలో ప్రకటించారు?
1) 1973 2) 1975
3) 1977 4) 1976

6. భారత ఆర్థిక వ్యవస్థ వెనుకబడి ఉండటానికి కింది వాటిలో ముఖ్య కారణం ఏది?
1) అధిక జనసాంద్రత
2) మూలధన కొరత
3) వినియోగం కాని మానవ వనరులు, సహజ వనరుల సహజీవనం
4) స్వల్ప తలసరి ఆదాయం

7. 'బాంబే ప్రణాళిక'కు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
1) ఇది జాతీయ ఆదాయానికి మూడురెట్లు
2) తలసరి ఆదాయాన్ని రెండు రెట్లు పెంచడం లక్ష్యం
3) 15 ఏళ్లకు ఏర్పాటు చేసిన ప్రణాళిక
4) పైవన్నీ

8. 'దీర్ఘదర్శి ప్రణాళిక'కు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
ఎ) ద్రవ్యోల్బణ రహిత ఆర్థిక సుస్థిరత
బి) సత్వర ఆర్థిక వృద్ధి
సి) సాంఘిక న్యాయం లక్ష్యం
డి) 15 నుంచి 20 ఏళ్ల పరిధి కలిగి ఉండటం
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) బి, సి, డి 4) ఎ, బి, సి, డి

9. వాక్యం (ఎ): రెండో పంచవర్ష ప్రణాళికను భారీ పెట్టుబడుల వ్యూహం ఆధారంగా రూపొందించారు
వాక్యం (బి): పబ్లిక్ రంగం అభివృద్ధి చెందితేనే ప్రైవేట్ రంగ పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడుతుంది
1) (ఎ), (బి) వాక్యాలు సరైనవి, (ఎ)కు (బి) సరైన వివరణ
2) (ఎ), (బి) వాక్యాలు సరైనవి, (ఎ)కు (బి) సరైన వివరణ కాదు
3) (ఎ) సరైంది, (బి) సరైంది కాదు
4) (బి) సరైంది, (ఎ) సరైంది కాదు

10. భారతదేశంలో వ్యవసాయ ధరల కమిషన్‌ను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
1) 1960 2) 1965
3) 1970 4) 1968

11. ఆర్థిక వ్యవస్థలోని వ్యవసాయ రంగం నుంచి ఇతర రంగాలకు పనివారిని మార్పు చేయడానికి సూచించేది?
1) వెనుకబాటు తనం
2) సాంకేతిక పురోగతి
3) ఆర్థిక వృద్ధి 4) ఎక్కువ వేతనాలు

12. పెట్టుబడుల ఉపసంహరణల కమిటీ అధ్యక్షుడు ఎవరు?
1) అరుణ్ జైన్
2) రంగరాజన్ 3) అమర్త్య సేన్
4) ఎల్.కె. ఝా

13. హరిత విప్లవ ప్రయోజనాలు.. ఏ సౌకర్యాలున్న ప్రాంతాలకు పరిమితమైనవి?
1) అధిక దిగుబడి రకాల వంగడాలు ఉన్న సౌకర్యాలు
2) నీటి పారుదల సౌకర్యాలు
3) రసాయన ఎరువుల లభ్యత సౌకర్యాలు
4) పంటల మార్పిడి సౌకర్యాలు

14. ప్రపంచీకరణ అంటే వివిధ దేశాల మధ్య స్వేచ్ఛగా ప్రవహించేది..?
1) వస్తువులు 2) పెట్టుబడులు
3) సాంకేతిక పరిజ్ఞానం
4) పైవన్నీ

15. సమష్టి డిమాండ్ పెరుగుదల కారణంగా ఉత్పన్నమయ్యేది?
1) మందకొడి ద్రవ్యోల్బణం
2) డిమాండ్ ప్రేరిత ద్రవ్యోల్బణం
3) వ్యయ ప్రేరిత ద్రోవ్యోల్బణం
4) సప్లయ్ ప్రేరిత ద్రవ్యోల్బణం

16. ఆర్థిక ప్రణాళికలను అమలు చేయడంలో ఏ దేశాన్ని మార్గదర్శకంగా తీసుకున్నారు?
1) రష్యా 2) జపాన్
3) అమెరికా 4) నార్వే

17. మోక్షగుండం విశ్వేశ్వరయ్య "Planned Economy of India"ను ఏ సంవత్సరంలో రాశారు?
1) 1933 2) 1934
3) 1935 4) 1936

18. భారతదేశ ప్రజల ఆర్థిక సంక్షేమానికి సంబంధించి కింది వాటిలో సరికానిది?
1) ట్రికల్ – డౌన్ బెనిఫిట్
2) వినియోగ వస్తువుల అధిక దిగుమతులు
3) నిలకడతో కూడిన వృద్ధి
4) అసమానతలతో తగ్గింపు

19. రైత్వారీ పద్ధతికి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
1) దీన్ని లార్డ్ హేస్టింగ్స్ గవర్నర్ జనరల్‌గా ఉన్నప్పుడు ప్రవేశపెట్టారు
2) 1820లో ప్రవేశపెట్టారు. ఇది 52% ఆచరణలో ఉంది
3) దీన్ని థామస్ మన్రో, రీడ్ పర్యవేక్షించారు
4) పైవన్నీ సరైనవే

20. ప్రచ్ఛన్న నిరుద్యోగం అంటే?
1) అన్ని కాలాల్లో ఉద్యోగ లభ్యత
2) విశ్రాంత ఉద్యోగులు
3) పూర్తికాలం ఉద్యోగం లేని వ్యక్తులు
4) తక్కువ మంది కావాల్సిన పనిలో ఎక్కువ మంది పనిచేయడం

21. ఏ విధానంలో గ్రామ భూమి సంయుక్త స్వామ్యం పరిధిలో ఉంటుంది?
1) జమీందారీ విధానం
2) మహల్వారీ విధానం
3) రైత్వారీ విధానం 4) పైవేవీ కావు

22. భారతదేశ వ్యవసాయానికి సంబంధించి కింది వాటిలో సరికానిది?
1) హరిత విప్లవం అంటే వ్యవసాయ ఉత్పత్తుల త్వరిత పెరుగుదల
2) భారత వ్యవసాయం రుతుపవనాల జూదం
3) భారతదేశంలో వ్యవసాయం ద్వితీయ పరిశ్రమ
4) కమతాల సమీకరణ వ్యవసాయం పెరగడానికి ఉపయోగపడుతుంది

23. కింది వాటిలో పేదరికానికి కారణమైన ఆర్థికేతర అంశం ఏది?
1) వ్యవసాయంలో అల్ప ఉత్పాదకత
2) ఆదాయ అసమానతలు
3) అధిక జనాభా పెరుగుదల
4) అధిక నిరక్షరాస్యత

24. 'ప్లానింగ్ అండ్ ద పూర్' అనే గ్రంథాన్ని రాసిందెవరు?
1) బి.ఎస్. మిన్‌హాస్
2) వై.కె. అలఘ్ 3) జగదీష్ భగదత్
4) అమర్త్యసేన్

25. 'కిసాన్ క్రెడిట్ కార్డ్' పథకాన్ని సూత్రీకరించింది?
1) ఆర్.బి.ఐ. 2) జి.ఐ.సి.
3) ఐ.సి.ఐ.సి.ఐ. 4) నాబార్డ్

26. దేశంలో వేగవంతమైన పారిశ్రామీకరణకు ప్రారంభించిన కొత్త విధానం?
1) ప్రైవేట్ పారిశ్రామికవేత్తలకు వివిధ రకాల రాయితీలను కల్పించడం
2) ప్రత్యేక ఆర్థిక మండళ్లను ఏర్పాటు చేయడం
3) అనేక దేశాలతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోవడం
4) పారిశ్రామిక విధానాల్లో సరికొత్త మార్పులకు ప్రణాళికలు వేయడం

27. మన దేశంలో అంత్యోదయ కార్యక్రమం మొదటగా ఏ రాష్ట్రంలో ప్రారంభించారు?
1) తమిళనాడు 2) ఆంధ్రప్రదేశ్
3) ఒడిశా 4) రాజస్థాన్

28. కింది వాటిలో పరోక్ష పన్నుకు ఉదాహరణ?
1) ఎక్సైజ్ పన్ను
2) ఎస్టేట్ పన్ను 3) ఆదాయ పన్ను
4) సంపద పన్ను

29. కింది వాటిలో దేశంలో పేదరికం ఏర్పడటానికి కారణం?
1) తక్కువ ఉత్పాదకత
2) ఉద్యోగిత లేని ఆర్థిక అభివృద్ధి
3) తక్కువ స్థాయి ఆర్థిక అభివృద్ధి
4) పైవన్నీ

30. సాధారణంగా బ్యాంకు రేటులో పెరుగుదల దేన్ని సూచిస్తుంది?
1) మార్కెట్ వడ్డీ రేటులో పతనం
2) సెంట్రల్ బ్యాంకు.. ఇతర వాణిజ్య బ్యాంకులకు రుణాలు ఇవ్వకపోవడం
3) సెంట్రల్ బ్యాంకు సులభ ద్రవ్యవిధానాన్ని అనుసరించడం
4) సెంట్రల్ బ్యాంకు కఠిన ద్రవ్య విధానాన్ని అనుసరించడం

31. జనాభా డివిడెండ్‌కు సంబంధించిన పూర్తి ప్రయోజనాలు పొందడానికి భారతదేశం ఏం చేయాలి?
1) నైపుణ్య వికాసాన్ని పెంపొందించాలి
2) మరిన్ని సామాజిక భద్రత పథకాలను ప్రవేశపెట్టాలి
3) శిశుమరణాల రేటును తగ్గించాలి
4) ఉన్నత విద్యను ప్రైవేటీకరించాలి

32. జతపరచండి.
జాబితా - I
i) నారిమన్ కమిటీ
ii) సరయూ కమిటీ
iii) మల్హోత్రా కమిటీ
iv) నరసింహం కమిటీ
జాబితా-II
a) లీడ్ బ్యాంక్ పథకం
b) ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు
c) బీమా రంగ సంస్కరణలు
d) బ్యాంకింగ్ సంస్కరణలు
1) i-a, ii-b, iii-c, iv-d
2) i-b, ii-c, iii-d, iv-a
3) i-c, ii-d, iii-a, iv-b
4) i-d, ii-a, iii-b, iv-c

33. జతపరచండి.

బ్యాంకు	స్థాపించిన సంవత్సరం
i) ఐ.సి.ఐ.సి.ఐ.	a) 1955
ii) ఎల్.ఐ.సి.	b) 1956
iii) యు.టి.ఐ .	c) 1964
iv) ఎగ్జిమ్ బ్యాంక్	d) 1982

1) i-a, ii-b, iii-c, iv-d
2) i-b, ii-c, iii-d, iv-a
3) i-c, ii-d, iii-a, iv-b
4) i-d, ii-a, iii-b, iv-c

34. జతపరచండి.
జాబితా-I
i) పుర నమూనా
ii) భారీ పరిశ్రమల వ్యూహం
iii) మానవ అభివృద్ధి సూచిక
iv) నవకల్పనల వృద్ధి రేటు
జాబితా-II
a) ఎ.పి.జె. అబ్దుల్ కలాం
b) మహలనోబిస్
c) మహబూబ్ హాక్
d) షుంపీటర్
1) i-a, ii-b, iii-c, iv-d
2) i-b, ii-c, iii-d, iv-a
3) i-c, ii-d, iii-a, iv-b
4) i-d, ii-a, iii-b, iv-c

35. సాధారణ ట్రెజరీ బిల్లుల కాలపరిమితి?
1) 91 రోజులు 2) 94 రోజులు
3) 90 రోజులు 4) 95 రోజులు

36. జతపరచండి.
జాబితా-I
i) మహవీర్ త్యాగి సంఘం
ii) భూతలింగం సంఘం
iii) కె.ఎన్. రాజ్ సంఘం
iv) సి.సి. ఛోక్సీ సంఘం
జాబితా-II
a) ప్రత్యక్ష పన్నుల పరిశీలన
b) పన్ను విధానాల ఆధునికీకరణ
c) వ్యవసాయంపై పన్ను
d) ప్రత్యక్ష పన్నులు
1) i-b, ii-c, iii-d, iv-a
2) i-a, ii-b, iii-c, iv-d
3) i-c, ii-d, iii-a, iv-b
4) i-a, ii-b, iii-d, iv-c

37. కింది వాటిలో ఏ దక్షిణాసియా దేశం స్థూల జాతీయ సంతోషాన్ని ప్రజల సుఖశాంతులకు సూచికగా పరిగణిస్తోంది?
1) భూటాన్ 2) బంగ్లాదేశ్
3) శ్రీలంక 4) ఆఫ్ఘనిస్తాన్

38. 'వృత్తులవారీ వ్యవస్థకు, ఆర్థికాభివృద్ధికి అవినాభావ సంబంధం ఉంటుంది' అని పేర్కొన్న వారెవరు?
1) ఎ.జి.బి. ఫిషర్
2) కాలిన్ క్లార్క్ 3) మాల్థస్
4) అమర్త్యసేన్

39. MRTP (Monopolies and Restrictive Trade Practices) చట్టాన్ని ఎప్పుడు ప్రవేశపెట్టారు?
1) 1969 2) 1970
3) 1968 4) 1971

40. మిశ్రమ ఆర్థిక వ్యవస్థకు పునాదులు వేసిన పారిశ్రామిక తీర్మానం ఏది?
1) 1956 2) 1948
3) 1977 4) 1991

సమాధానాలు

1) 4	2) 4	3) 4	4) 3	5) 2
6) 3	7) 4	8) 4	9) 1	10) 2
11) 3	12) 2	13) 2	14) 4	15) 2
16) 1	17) 2	18) 2	19) 4	20) 4
21) 2	22) 3	23) 4	24) 1	25) 4
26) 2	27) 4	28) 1	29) 4	30) 4
31) 3	32) 1	33) 1	34) 1	35) 1
36) 2	37) 1	38) 2	39) 1	40) 2

Who is the author of "I Do What I Do"?




N. Vijayender Reddy
Subject Expert, Hyderabad.

GENERAL AWARENESS

1. Which of the following became the first video to hit 3 billion views on YouTube in August 2017?
   1) "Sorry" by Justin Bieber
   2) "Gangnam Style" by Psy
   3) "See You Again" by Wiz Khalifa
   4) "Blank Space" by Taylor Swift
   5) "Despacito" by Luis Fonsi
2. Which former RBI Governor is the author of the book "I Do What I Do"? (The book will be launched in September 2017)
   1) D. Subbarao
   2) Dr. Y.V. Reddy
   3) C. Rangarajan
   4) Raghuram Rajan
   5) Bimal Jalan
3. Which State government has formed "Maa" Committees to check mid-day meals quality in schools?
   1) Punjab 2) Haryana
   3) Uttar Pradesh 4) Bihar 5) Madhya Pradesh
4. Who was elected as the Chairman of FIFA governance committee in May 2017?
   1) Justice Manmohan Singh
   2) Justice V.K. Shali
   3) Justice Suresh Kait
   4) Justice Mukul Mudgal
   5) Justice G.P. Mittal
5. Who was appointed the chairman of National Commission for Minorities (NCM) in May 2017?
   1) Syed Ghayorul Hasan Rizvi
   2) George Kurian
   3) Sunil Singhi
   4) Vada Dasturji Khurshed
   5) None of these
6. Which Hindi actor was honored with the Master Dinanath Mangeshkar Award in April 2017?
   1) Shah Rukh Khan
   2) Salman Khan
   3) Aamir Khan
   4) Akshay Kumar
   5) Anupam Kher
7. Who won the 2017 Pulitzer Prize in fiction for the book "The Underground Railroad"?
   1) C.E. Morgan
   2) Colson Whitehead
   3) Adam Haslett 4) Kelly Link
   5) Margaret Verble





8. As per an IMF report India will overtake which of the following countries in 2022 as the world's fourth largest economy?
   1) USA 2) China 3) Japan
   4) Germany 5) U.K.
9. Yusra Mardini was appointed as UNHCR Goodwill Ambassador in April 2017. She belongs to:
   1) Turkey 2) Yemen
   3) Syria 4) Greece
   5) Lebanon
10. September 28th marks the death anniversary of Louis Pasteur. It is observed as:
    1) World Tuberculosis Day
    2) World Rabies Day
    3) World Heart Day
    4) World Kidney Day
    5) World Health Day
11. The International Council on Monuments and Sites (ICOMOS) has its headquarters at:
    1) Paris 2) Vienna 3) Rome
    4) Venice 5) The Hague
12. The Executive Secretary of the United Nations Framework Convention on Climate Change (UNFCCC) visited India recently. Her name is:
    1) Christiana Figueres
    2) Patricia Espinosa
    3) Federica Mogherini
    4) Sylvie Goulard
    5) Annick Girardin
13. Pudong International Airport is located in which of the following cities?
    1) Seoul 2) Beijing
    3) Shanghai 4) Hongkong
    5) Tokyo
14. Who is the author of the book "On Balance: An Autobiography"?
    1) Justice Anna Chandy
    2) Justice Leila Seth
    3) Justice Fathima Beevi
    4) Justice Sujata Manohar
    5) None of these
15. Which of the following topped the International Institute for Management Development's (IMD) World Competitiveness list released in June 2017?
    1) Hong Kong
    2) Switzerland 3) Singapore
    4) USA 5) Netherlands
16. Where are the headquarters of the World Water Council?
    1) Zurich, Switzerland
    2) Frankfurt, Germany
    3) Marseille, France
    4) Nairobi, Kenya
    5) Sochi, Russia

KEY

1) 5	2) 4	3) 3	4) 4
5) 1	6) 3	7) 2	8) 4
9) 3	10) 2	11) 1	12) 2
13) 3	14) 2	15) 1	16) 3

పక్కా ప్రణాళికతో పది గ్రేడ్ పాయింట్లు



యార్లగడ్డ వనంరాజు
స్కూల్ అసిస్టెంట్, జీహెచ్ఎస్, నందికొట్కూరు

పదో తరగతిలో పది గ్రేడ్ పాయింట్లు సాధించాలంటే విద్యార్థులు ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించాలి. మ్యాథమెటిక్స్ సబ్జెక్టుకు సంబంధించి విద్యార్థులు ముఖ్య భావనలపై దృష్టి సారించాలి. నిరంతర, సమగ్ర మూల్యాంకనం (సీసీఈ) విధానంలోని ప్రశ్నపత్రంపై అవగాహన పెంపొందించుకోవాలి.



అధ్యాయాల విశ్లేషణ: పదో తరగతి గణితంలో మొత్తం 14 అధ్యాయాలున్నాయి. 1, 2, 3, 4, 5, 6, 10వ అధ్యాయాలను పేపర్-1గా, 7, 8, 9, 11, 12, 13, 14 అధ్యాయాలను పేపర్-2గా పేర్కొన్నారు.

పేపర్-1:

1. వాస్తవ సంఖ్యలు; 2. సమితులు; 3. బహుపదులు; 4. రెండు చలరాశుల్లో రేఖీయ సమీకరణాల జత; 5. వర్గ సమీకరణాలు; 6. శ్రేఢులు; 10. క్షేత్రమితి

పేపర్-2:

7. నిరూపక రేఖాగణితం; 8. సరూప త్రిభుజాలు; 9. వృత్తానికి స్పర్శ రేఖలు-ఛేదన రేఖలు; 11. త్రికోణమితి, 12. త్రికోణమితి అనువర్తనాలు; 13. సంభావ్యత; 14. సాంఖ్యకశాస్త్రం.

- వాస్తవ సంఖ్యలు, సమితులు, సంభావ్యత, సాంఖ్యక శాస్త్రం అధ్యాయాలు సాధారణ విద్యార్థికి కూడా సులువుగా అర్థమవుతాయి. శ్రేఢులు, సరూప త్రిభుజాలు, వృత్తానికి స్పర్శరేఖలు-ఛేదన రేఖలు, క్షేత్రమితి, త్రికోణమితి అధ్యాయాలు క్లిష్టమైనవి.
- రెండు చలరాశుల్లో రేఖీయ సమీకరణాల జత, నిరూపక రేఖాగణితం, క్షేత్రమితి అధ్యాయాల్లో ఎక్కువ మార్కులు సాధించడానికి ఆస్కారం ఉంటుంది.
- పబ్లిక్ పరీక్షల్లో రెండు చలరాశుల్లో రేఖీయ సమీకరణాల జత, వర్గ సమీకరణాలు, సాంఖ్యకశాస్త్రం అధ్యాయాల నుంచి మాత్రమే గ్రాఫ్ సమస్యలు ఇస్తారు. సరూప త్రిభుజాలు, వృత్తానికి స్పర్శరేఖలు-ఛేదన రేఖలు అధ్యాయాల నుంచి మాత్రమే నిర్మాణ సమస్యలు వస్తాయి. సరూప త్రిభుజాలు, వృత్తానికి స్పర్శరేఖలు-ఛేదనరేఖలు అధ్యాయాల నుంచి సిద్ధాంతాలు, సిద్ధాంత అనువర్తనాలను ఇస్తారు. సీసీఈ విధానం ప్రకారం ప్రశ్నపత్రంలో ఏ అధ్యాయం నుంచైనా, ఏ సమస్యనైనా అడగొచ్చు. అందువల్ల విద్యార్థులు తప్పనిసరిగా అన్ని అధ్యాయాలను అధ్యయనం చేయాలి.


అధ్యాయాలు-ముఖ్యమైన భావనలు


1. **వాస్తవ సంఖ్యలు:** అకరణీయ సంఖ్యల్లో ఏవి అంతమయ్యే దశాంశాలో, ఏవి అంతం కాని ఆవర్తన దశాంశాలో కనుక్కోవడం, $\sqrt{2}$, $5-\sqrt{3}$, $3\sqrt{2}$, $\sqrt{2}+\sqrt{3}$ మొదలైనవి కరణీయ సంఖ్యలు అని నిరూపించే విధానం, మూడు సంవర్గమాన న్యాయాలు - వాటి నిరూపణ, వాటిపై సమస్యలు.
2. **సమితులు:** సమితులు-రకాలు, సమితుల సమ్మేళనం, ఛేదనానికి సంబంధించిన సమస్యలు.
3. **బహుపదులు:** వర్గ బహుపదులు-రేఖాచిత్రాలు, వర్గ, ఘన బహుపదుల గుణకాలకు, శూన్యాలకు మధ్య సంబంధం. బహుపదుల భాగహార నియమ సమస్యలు.
4. **రెండు చలరాశుల్లో రేఖీయ సమీకరణాల జత:** గ్రాఫ్ పద్ధతి, ప్రతిక్షేపణ పద్ధతి, చలరాశి తొలగింపు పద్ధతుల ద్వారా రేఖీయ సమీకరణాల జత సాధన కనుక్కొనే సమస్యలు.
5. **వర్గ సమీకరణాలు:** వర్గ సమీకరణాన్ని సాధించే సమస్యలు, గ్రాఫ్ పద్ధతి, కారణాంక పద్ధతి, వర్గాన్ని పూర్తి చేయడం ద్వారా సాధించే పద్ధతి, వాటి అనువర్తన సమస్యలు.
6. **శ్రేఢులు:** nవ పదం, n పదాల మొత్తం కనుక్కొనే అంకశ్రేఢి, గుణశ్రేఢి సమస్యలు.
7. **నిరూపక రేఖాగణితం:** రెండు బిందువుల మధ్య దూరం, విభజన సూత్రం, త్రిభుజ వైశాల్యం సూత్రాలపై ఇచ్చే సమస్యలు.
8. **సరూప త్రిభుజాలు:** ప్రాథమిక అనుపాత సిద్ధాంతం, పైథాగరస్ సిద్ధాంతం, వాటి అనువర్తన సమస్యలు, రేఖాఖండాన్ని m:n నిష్పత్తిలో విభజించే నిర్మాణం.
9. **వృత్తానికి స్పర్శరేఖలు-ఛేదన రేఖలు:** వృత్తానికి స్పర్శరేఖలు గీసే నిర్మాణం, అల్ప, అధిక వృత్త ఖండ వైశాల్యాన్ని కనుక్కోవడం.
10. **క్షేత్రమితి:** ఘనాకార వస్తు సముదాయ ఉపరితల వైశాల్యం, ఘన పరిమాణం సమస్యలు.
11. **త్రికోణమితి:** త్రికోణమితి నిష్పత్తులు-సమస్యలు, త్రికోణమితీయ సమీకరణాలు-సమస్యలు.
12. **త్రికోణమితి అనువర్తనాలు:** త్రికోణమితి నిష్పత్తులను ఉపయోగించి శిఖరం, స్తంభం ఎత్తు, నది వెడల్పు, దూరాలు కనుక్కోవడం
13. **సంభావ్యత:** నాణేలు, పాచికలు, పేకముక్క కార్డులకు సంబంధించిన వివిధ రకాల ఘటనల సంభావ్యత సమస్యలు.
14. **సాంఖ్యక శాస్త్రం:** వర్గీకృత దత్తాంశం సగటు, మధ్యగతం బాహుళకాన్ని కనుక్కొనే సమస్యలు, ఓజీవ్ వక్రం నుంచి మధ్యగతాన్ని కనుగొనే గ్రాఫ్ సమస్య.


ప్రిపరేషన్ ఇలా..

- గత పబ్లిక్ పరీక్ష పత్రాలను పరిశీలించి ఎక్కువ సమస్యలు వచ్చే అధ్యాయాలు, వాటిలోని ముఖ్యమైన సమస్యలు, ప్రశ్నల సరళిని, మార్కుల వెయిటేజీని గుర్తించి ప్రిపరేషన్ ప్రారంభించాలి.
- ప్రతి అధ్యాయంలోని సూత్రాలు, నిర్వచనాలను ఒక నోట్‌బుక్‌లో రాసి పెట్టుకుని తరచూ చదువుకుంటూ ఉండాలి.
- వాస్తవ సంఖ్యలు, సమితులు, సంభావ్యత, సాంఖ్యక శాస్త్రం లాంటి సులువైన అధ్యాయాల్లోని సమస్యలన్నింటిని ప్రాక్టీస్ చేయాలి. కష్టమైన అధ్యాయాల నుంచి కనీసం ముఖ్యమైన సమస్యలను సాధన చేయాలి.
- సీసీఈ విధానంలో గణితం విద్యా ప్రమాణాలైన సమస్య సాధన, కారణాలు చెప్పడం, నిరూపణ చేయడం, వ్యక్తపరచడం, అనుసంధానం, దృశ్యీకరణ, ప్రాతినిధ్యపరచడం విభాగాల కింద ప్రశ్నపత్రంలో ఇచ్చే ప్రశ్నల గురించి అవగాహన చేసుకోవాలి. ఇందుకోసం గణిత ఉపాధ్యాయుడి సహకారం తీసుకోవాలి.
- గ్రాఫ్, నిర్మాణం సమస్యలు, సిద్ధాంతాలు కచ్చితంగా వస్తాయి. వాటికి సంబంధించిన అన్ని సమస్యలను సాధన చేయాలి.
- ప్రతి అధ్యాయంలోని బిట్స్‌తోపాటు ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షల గత ప్రశ్నపత్రాలు, మోడల్ పేపర్లను ప్రాక్టీస్ చేయాలి.

కింది రెండు బొమ్మల మధ్య ఉన్న 5 తేడాలను గుర్తించండి








ఇక్కడ రంగులలో ఉన్న బొమ్మల నీడలు రెండో వైపున ఉన్నాయి. దేని నీడ ఏదో కనుక్కుని జత కలపండి.

నాన్నా చెప్పవా?

గాలి కింది పొరల్లో ఓజోన్ ఉండటం మంచిది కాదా?

భూగోళాన్ని ఆవరించి ఉన్న వాతావరణాన్ని ట్రోపో ఆవరణం, స్ట్రాటో ఆవరణం, ఐనో ఆవరణం అనే మూడు ప్రధాన భాగాలుగా విభజించారు. వీటిలో ట్రోపో ఆవరణం నేల నుంచి 10 మైళ్ల ఎత్తు దాకా వ్యాపించి ఉంటే, స్ట్రాటో ఆవరణం దీనిపై భాగంలో ఉంది. ఈ రెండు మండలాల్లోనూ ఓజోను ఉన్నప్పటికీ ట్రోపో ఆవరణంలోని ఓజోను జీవులకు హానికలిగిస్తే, స్ట్రాటో ఆవరణంలోని



ఓజోను మాత్రం మొత్తం జీవ జాతికి ఒక పెద్ద రక్షణ కవచంలా నిలుస్తోంది. మూడు ఆక్సిజన్ పరమాణువులతో రూపొందే ప్రత్యేకమైన ఆక్సిజన్ అణువునే ఓజోన్ అంటారు. భూగోళంపై 10 మైళ్ల ఎత్తు నుంచి మొదలు పెట్టి 30 మైళ్ల ఎత్తుదాకా ఉన్న వాతావరణంలో పెద్ద మొత్తంలో ఉన్న ఓజోన్ వాయువు సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల వంటి కొన్ని ప్రమాదకరమైన కిరణాలను అడ్డుకుని, మొత్తం ప్రాణికోటికి మేలు చేస్తోంది. ఒకవేళ ఓజోన్ వాయువు ఈ పని చేయనట్లయితే భూమిపై సంచరించే జీవులలో చర్మ క్యాన్సరు, కంటికి సంబంధించిన జబ్బులు, మరికొన్ని ఇతర వ్యాధులు అపారంగా పెరుగుతాయి. వ్యాధినిరోధక శక్తి బాగా దెబ్బతింటుంది. నేలపై పెరిగే సోయాబీన్ వంటి కొన్ని పంటలు బాగా దెబ్బతినడమే గాక, సముద్రంలో మొత్తం ఆహార చక్రాలకు మూలాధారమైన ఫైటో ప్లాంక్టన్ అనే చిరుమొక్కల పెరుగుదల కూడా బాగా తగ్గిపోతుంది. దాని పర్యవసానం జలచరాలపై చాలా తీవ్రంగా ఉంటుంది. ఆ విధంగా వాతావరణం పై పొరలోని ఓజోన్ వాయువు మన భూగోళానికి మేలు చేస్తుంటే, కింది పొరల్లోని ఓజోన్ వాయువు మాత్రం మనుషుల ఆరోగ్యానికి, పంటలకు హాని చేసే ఓ కాలుష్య కారకంగా నిలుస్తోంది. అయితే కింది పొరల్లో ఉన్నప్పటికీ, పై పొరలో ఉన్నప్పటికీ ఓజోన్‌కి సంబంధించిన రసాయనిక ధర్మాలలో మాత్రం ఎలాంటి మార్పు ఉండదు.

గుర్తించండి

కింద ఇచ్చిన బొమ్మల పేర్లు పజిల్‌లో ఎక్కడ ఉన్నాయో గుర్తించండి.

hippo	b	o	o	t	i	e	s	i	g
bridge	b	a	h	u	v	a	q	n	o
forest	a	h	i	p	p	o	m	e	e
finger	s	t	e	k	c	i	r	c	l
dragon	m	e	f	i	n	g	e	r	c
bicycle	d	r	a	g	o	n	w	v	y
cricket	i	b	r	i	d	g	e	l	c
booties	z	m	d	s	a	n	w	s	i
	l	p	f	o	r	e	s	t	b



దారి చూపండి

బయట ఉన్న కాకరకాయ మధ్యలో ఉన్న ఉల్లి, టమాటా, వంకాయల దగ్గరకు వెళ్ళాలి. దారి చూపండి




చుక్కలు కలపండి.. రంగులు వేయండి



మీకు తెలుసా?

పులులు వేటాడటంకోసం సూర్యాస్తమయం కావాలని ఎదురుచూస్తాయి





దవడలకున్న అనుకూలత వల్ల పాములు తమ తలకన్నా పెద్ద జంతువులను కూడా తింటాయి.

అమెరికాలో సరస్సుల్లో ఏటా ఈతగాళ్లకు దొరికే గోల్ఫ్‌బాల్స్ విలువ లక్షాయాభైవేల డాలర్లు



అలారం తయారు చేసిన తొలిరోజుల్లో కేవలం ఉదయం నాలుగు గంటలకు మాత్రమే మోగేది



సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో
టైలరింగ్, మెహందీలో శిక్షణ

సాక్షి, మైత్రి మహిళ ఆధ్వర్యంలో టైలరింగ్, మెహందీలో శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టైలరింగ్ విభాగంలో బాడీ మెజర్‌మెంట్స్ అండ్ కటింగ్, డ్రాఫ్టింగ్ థియరీ, మెథడ్ ఆఫ్ కటింగ్ అండ్ స్టిచ్చింగ్, నెక్ ఫినిషింగ్, ప్యాచ్ వర్క్, కాలర్‌నెక్ బ్లౌజ్, ప్రిన్సెస్ కట్ బ్లౌజ్, కొటారి, బోట్‌నెక్ బ్లౌజ్ విభాగాల్లో శిక్షణ ఉంటుందన్నారు. వీటికి 900 రూపాయలు ఫీజుగా నిర్ధారించారు. ఆసక్తి గల అభ్యర్థులు సూర్యకృష్ణ ఫ్యాషన్ డిజైనింగ్ హౌస్, ఎంఆర్ఓ ఆఫీస్ దరి, చిన్నవీధి, విజయనగరంలో సంప్రదించాలన్నారు. అలాగే మెహందీ, నెయిల్ ఆర్ట్ విభాగంలో కోన్ ప్రిపరేషన్, బేసిక్ స్ట్రోక్స్, అరబిక్, ఇండియన్, దుల్హాన్, మొరబీన్స్ డిజైన్స్‌తో పాటు బేసిక్ నెయిల్ ఆర్ట్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వీటికి ఫీజు 600 రూపాయలు. ఆసక్తి గల అభ్యర్థులు యు న్యూలుక్ బ్యూటీ పార్లర్, అయ్యప్ప సదన్, కోరాడ వీధి, 16–3–36, ఎంపీ హౌస్ దరి, విజయనగరంలో సంప్రదించాలన్నారు. 27–08–17 నుంచి 30–08–17లోగా పేర్లు నమోదు చేసుకుంటే, 31008–17 నుంచి 06–09–17 వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 96662 83534 నంబర్‌కు సంప్రదించాలన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.

దేశానికి పేరు తీసుకురావాలి...

- జెడ్పీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి
- నవోదయ విద్యాలయంలో ఐదు రాష్ట్రాల హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వాతిరాణి

శృంగవరపుకోట రూరల్:

జవహర్ నవోదయ విద్యార్థులు క్రీడల్లో దేశానికి ప్రాతినిథ్యం వహించి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని జెడ్పీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి పిలుపునిచ్చారు. ఎస్.కోట మండలం కిల్తంపాలెంలో గల జవహర్ నవోదయ విద్యాలయంలో హైదరాబాద్ రీజియన్ లోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పాండిచ్చేరి, కర్నాటక, కేరళ రాష్ట్రాల (రీజనల్ స్థాయి) నవోదయ విద్యార్థులకు హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. 26,27,28 తేదీలలో జరగనున్న అండర్ –14, అండర్–19 బాల, బాలికల హ్యాండ్‌బాల్ మీట్ –2017ను ఆమె శనివారం ప్రారంభించారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ, రీజనల్ హ్యాండ్‌బాల్ పోటీలను జిల్లాలో నిర్వహించడం గర్వకారణమన్నారు. ముందుగా జెడ్పీ చైర్‌పర్సన్ క్లస్టర్ల వారీగా క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోటీలకు సహాయ పర్యవేక్షకుడిగా వ్యవహరించనున్న శ్రీకాకుళం నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ ఎం. శ్రీనివాస రావు పోటీల తీరు, క్రీడాకారులు వ్యవహరించాల్సిన మార్గదర్శకాలను వివరించారు. అనంతరం క్రీడాకారులు, విద్యాలయాల పీఈటీలు, రిఫరీలు క్రీడా టార్చ్‌ను ప్రదర్శించారు.

ప్రారంభ మ్యాచ్ ఖమ్మం, తూర్పు గోదావరి జిల్లా క్రీడాకారుల మధ్య హోరాహోరీగా సాగింది. అంతకు ముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ దామా అంజయ్య, ఎంపీపీ రెడ్డి వెంకన్న, జెడ్పీటీసీ సభ్యురాలు సుకురు రామలక్ష్మి, ప్రముఖ వ్యాపారవేత్త మిడతాన చిన్నంనాయుడు, కొత్తవలస మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ ఐ.సావిత్రమ్మ, సీతారాంపురం, ఎస్.కోటతలారి సర్పంచ్‌లు జి.సన్యాసప్పడు, రెడ్డి భవాని, వైస్ సర్పంచ్ ఎం. సత్యవతి, ఆంగ్ల అధ్యాపకుడు రవిరాజు, నవోదయ అధ్యాపకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కృష్ణలీలా తరంగిణి నృత్యరూపకం ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

క్రికెట్ పండుగకు సర్వం సిద్ధం



సిద్ధమైన మైదానం

విజయనగరం మున్సిపాలిటీ: ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న 22 రోజుల క్రికెట్ పండుగకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సర్ విజ్జీ ఆహ్వానపు క్రికెట్ టోర్నీ పేరిట ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 18 వరకు టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ క్రమంలో డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సుందరంగా తీర్చిదిద్దారు. టోర్నీలో పాల్గొనే ఆంధ్ర, ఆంధ్రా ప్రెసిడెన్సీ ఎలెవన్ జట్లు శనివారం ఇదే మైదానం ఆవరణలో ప్రాక్టీస్ చేశారు. కార్యక్రమంలో జట్టు క్రీడాకారులతో కోచ్‌లు, ట్రైనీలు సుదర్శన్, సుబదీప్ ఘోష్, కృష్ణారావు, మాజీ అంతర్జాతీయ క్రీడాకారుడు (ప్రస్తుత ఆంధ్రా జట్టు క్రీడాకారుడు)వేణుగోపాలరావు, కాంప్లెక్స్ అడ్మినిస్ట్రేషన్ అధికారి జె.త్రినాథరెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబరచాలి..

- జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కేవీ ప్రభావతి
- అయోధ్య మైదానంలో హాకీ, ఫెన్సింగ్, ఖోఖో జట్ల ఎంపిక పూర్తి



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం మున్సిపాలిటీ:

రాష్ట్ర స్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్‌కు ఎంపికైన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కేవీ ప్రభావతి ఆకాంక్షించారు. త్వరలో జరగనున్న అంతర్ జిల్లాల అండర్–14/17 బాల, బాలికల ఖోఖో, ఫెన్సింగ్, హాకీ క్రీడా పోటీలకు శనివారం జిల్లా జట్లను ఎంపిక చేశారు. పట్టణంలోని అయోధ్య మైదానంలో జరిగిన ఎంపికలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఫెన్సింగ్ క్రీడాంశంలో అండర్–14, 17 విభాగాల్లో నాలుగు జట్లకు సంబంధించి 48 మంది క్రీడాకారులకు స్థానం కల్పించినట్లు చెప్పారు. అలాగే ఖోఖో అండర్–14 విభాగంలో నిర్వహించిన ఎంపికలకు బాలుర విభాగంలో 12 మందికి, బాలికల విభాగంలో 12 మంది అర్హత సాధించారన్నారు. ఎంపికై న క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు సంబంధించిన తేదీలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఎల్వీ రమణ, తవిటయ్య, కేఏఎన్ రాజు, కె.గోపాల్, పెనుమత్స బంగార్రాజు, తదితరులు పాల్గొన్నారు.

చదువుపైనే దృష్టి



విద్యార్థినులతో మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరక్టర్ సునీల్ రాజ్‌కుమార్

విజయనగరం కంటోన్మెంట్: సాంఘిక సంక్షేమ కళాశాల వసతిగృహ విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె. సునీల్‌రాజ్‌కుమార్ తెలిపారు. దాసన్నపేటలోని కళాశాల విద్యార్థినుల వసతిగృహాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలలు, వివిధ విద్యాసంస్థల నుంచి విద్యార్థులు నేరుగా వసతి గృహానికే రావాలన్నారు. వసతిగృహం నిర్వహణలో కాని, వసతుల విషయంలో కానీ ఏమేని సమస్యలుంటే తనకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తప్పనిసరి

- ఐజీపీ సంజయ్

విజయనగరం టౌన్:

పోలీస్ శిక్షణలో ఆధునిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ఐజీపీ ఎన్. సంజయ్ అన్నారు. శనివారం స్థానిక పీటీసీని ఆయన సందర్శించారు. ముందుగా శిక్షణార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టెక్నాలజీపరంగా పోలీసులు శిక్షణ పొందాలన్నారు. కంప్యూటర్, డ్రైవింగ్, స్విమ్మింగ్ ఇలా అన్ని రంగాల్లో నిపుణుల్లా తయారుకావాలని సూచించారు. అనతరం టెక్నాలజీని వినియోగించి ఏయే పనులు ఏ విధంగా చేయవచ్చో వివరించారు. పీటీసీ ప్రిన్సిపల్ కె.రాజశిఖామణి మాట్లాడుతూ, శిక్షణలో ఉన్న కానిస్టేబుల్స్ డీజీపీ, ఐజీపీ ఆదేశాల మేరకు శిక్షణ పొందాలని సూచించారు. ఎస్పీ జి.పాలరాజు మాట్లాడుతూ, ప్రతి పోలీస్ అధికారి టెక్నాలజీ రంగంలో నైపుణ్యం సాధిస్తే కేసుల ఛేదన సులువవుతుందన్నారు. అనంతరం ఇతర పోలీస్ శిక్షణ కళాశాలల నుంచి వచ్చిన ప్రిన్సిపల్స్, వైస్ ప్రిన్సిపల్స్‌తో సమావేశమై శిక్షణలో ఉన్న లోటుపాట్లను గురించి ఐజీపీ తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో శిక్షణార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐజీపీ సంజయ్

జై జై గణేశా..

జిల్లాలో గణపతి పూజలు శుక్రవారం వేడుకగా జరిగాయి. భక్తులు వివిధ రూపాల్లో ఉన్న విగ్రహాలను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తి శ్రద్ధలతో వినాయక వ్రతాలు నిర్వహించారు. భారీ సెట్‌లు, విద్యుత్ దీపాలతో మండపాలను సుందరంగా అలంకరించారు. పలు చోట్ల మొదటి రోజే వినాయక విగ్రహాలను తిరువీధి జరిపి నిమజ్జనం చేశారు. వినాయక పూజలతో విద్యలనగరంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

– సాక్షి నెట్ వర్క్

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం





తోటపాలెంలో కాంతులతో మెరిసిపోతున్న మండపాలు


విజయనగరం ఆసుపత్రి రోడ్డులో ఆకర్షించే సెట్


బాలాజీ మార్కెట్‌లో విద్యుత్‌కాంతులతో రాధాకృష్ణులు



ఎన్‌సీఎస్ రోడ్డులో వినాయక సెట్


రింగ్‌రోడ్డు జొన్నగుడ్డిలో చాక్లెట్ వినాయకుడు


బాలాజీ మార్కెట్‌లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం


విజయనగరం ఎన్‌సీఎస్ రోడ్డులో గజేంద్రులపై కొలువుదీరిన గణనాథుడు


పార్వతీపురం బాలాజీథియేటర్ వద్ద శ్రీత్రిమూర్తి త్రిశక్తి సహిత మహాకైలాస గహ్వర ప్రమర గణపతి విగ్రహం



రైల్వే ఓల్డ్ కాలనీలో శివుని చేతిలో గణపతి


విజయనగరం వైఎస్సార్ సర్కిల్ రోడ్డులో ఎలుక వాహనంపై గణపతి


విజయనగరం అరుంధతీనగర్‌లో బాహుబలి-2 వినాయకుడు


విజయనగరం యాతవీధిలో రాయల్‌ఫోర్ట్ సెట్



బలిజిపేట మెట్టవీధిలో కొలువైన లక్ష్మీగణపతి


కె.ఎల్.పురంలో వెంకటేశ్వరస్వామి ఆలయం సెట్


నెల్లిమర్ల: రామతీర్థం జంక్షన్ ఎస్సీకాలనీలో నిర్మించిన గుహ మండపం


గాడిఖానా రైల్వే స్టేషన్ రోడ్డులో స్వచ్ఛభారత్ సెట్



గాడిఖానా రైల్వే స్టేషన్‌లో రాక్షసునిపై గణపతి



గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్ పేటలో కొలువుదీరిన చింతపిక్కల వినాయకుడు


విజయనగరం బాలాజీ మార్కెట్‌లో కొలువు తీరిన గణపతి


రైల్వే ఓల్డ్ కాలనీలో తబలా సెట్


రైల్వే ఓల్డ్ కాలనీలో పొదల్లో అమ్మవారి ఆకారంలో విగ్రహం


విజయనగరం వైఎస్సార్ సర్కిల్ వద్ద ఆకర్షించే సెట్


విజయనగరం భాగ్యశ్రీ అపార్ట్‌మెంట్‌లో భారీ వినాయక విగ్రహం


కణపాక రోడ్డులో కోట సెట్‌లో కొలువుదీరిన వినాయకుడు


రైల్వే కాలనీలో పూజలందుకుంటున్న గణనాథుడు


వీటీ అగ్రహారంలో భారీ సెట్


బాలాజీ మార్కెట్‌లో వినాయకుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

సేవల్లో పురుషోత్తముడు

- సేవే పరమావదిగా ముందుకు సాగుతున్న ఉపాధ్యాయుడు
- పేదలను ఆదుకుంటున్న వైనం
- అమ్మా సేవా సొసైటీ ప్రతినిధిగా ఎనలేని సేవ


కథల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అప్పటి డీఈవో సుబ్బారావు

ఆయన వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు.. ప్రవృత్తి సేవ చేయడం. విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యను బోధించడమే కాదు.. పేద పిల్లలకు సొంత డబ్బులతో పుస్తకాలు, దుస్తులు అందజేస్తారు. ప్రతిభ చూపే విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తారు. దాతల సాయంతో చదువుకు కావాల్సిన సదుపాయాలు సమకూర్చుతారు. ఆయన ఎక్కడ పనిచేసినా ఆ గ్రామంలో శతశాతం అక్షరాస్యత నమోదుకావాల్సిందే. దీనికోసం గోడలపై అక్షరాలు రాయించి నిరక్షరాస్యులకు బోధిస్తారు. అందుకే.. ఆయనను అవార్డులు వరిస్తున్నాయి. సేవలకు ప్రశంసల జల్లు కురుస్తోంది. గుర్ల మండలంలోని భూపాలపురం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న అల్లం పురుషోత్తమరావు సేవలను ఓ సారి పరికిస్తే...

గుర్ల: ఎవరైనా ఆపదలో ఉన్నా.. చదువులో ప్రతిభ చూపే విద్యార్థులు ఉన్నత చదువుల కోసం డబ్బు సమస్య ఎదుర్కొంటున్నారని తెలిసినా గుర్ల మండలంలోని భూపాలపురం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న అల్లం పురుషోత్తమరావు చలించిపోతారు. పేదలకు సాయం చేస్తారు. విద్యార్థులకు చదువుకు కావాల్సిన ఆర్థిక సాయం అందజేస్తారు. ఆయన బోధన కూడా వినూత్నంగా ఉంటుంది. పాఠ్యాంశాలను ప్రయోగాత్మకంగా వివరిస్తారు. వ్యాసరచన, వక్తృత్వ, క్రీడా పోటీలు నిర్వహించి విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నారు. క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు.

శతశాతం అక్షరాస్యత కోసం..

ఆయన ఏ గ్రామంలో పనిచేసినా అక్కడి వారంతా అక్షరాస్యులు కావాల్సిందే. దీనికోసం వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని గోడలను నల్లబల్లలుగా మార్చి అక్షరాలు, గుణింతాలు, ఎక్కాలు, సామెతలు, ఆంగ్ల అక్షరమాలను రాయిస్తున్నారు. వాటిని ప్రతి రోజు పిల్లలతో నిరక్షరాస్యులకు బోధించేలా చేస్తున్నారు. ఆయన ఎక్కడ పనిచేసినా ఆగ్రామంలోను, లేదంటే సమీపంలో నివసిస్తారు. పాఠశాల, గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తారు.

ప్రయోగాలతో ఆసక్తి..

మైక్రోస్కోపు, టెలిస్కోప్, ఆక్సిజన్ తయారీ, కార్బన్ డైయాక్సైడ్ తయారు చేసే విధానాలను విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించి సైన్స్‌పై ఆసక్తి పెంచుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని బడికి వచ్చే పిల్లలకు పౌష్టికాహార సమస్యతో బాధపడుతున్నట్టు గుర్తించి మధ్యాహ్న భోజనంలో సొంత డబ్బులతో గుడ్లు వడ్డిస్తున్నారు. రెండు వందల మంది విద్యార్థులకు నెలలో ఎనిమిదిసార్లు గుడ్లు పంపిణీ చేస్తున్నారు.

'అమ్మ' సేవా సొసైటీ సహాయంతో ...

ఏటా రెండు ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి 20 మంది నిరుపేద, ప్రతిభ గల విద్యార్థులకు ఐదు సంవత్సరాల ఉన్నత చదువు చదువుకునేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు. యూనిఫారాలు, పుస్తకాలు, మెస్ చార్జీలు, కళాశాల రుసుములు, పరీక్ష ఫీజులు, బస్సు పాసులకయ్యే ఖర్చులన్నీ వారే భరిస్తారు. అమ్మ సేవా సొసైటీ నుంచి నాలుగు కళాశాలల నుంచి 60 మంది విద్యార్థులకు ఆర్థిక సహాయం అందేలా ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

సేవలకు అవార్డుల వరద

- 2007లో జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు
- 2007లో మదర్ థెరిసా సేవా సంస్థ తరఫున సేవా రత్న అవార్డు
- 2007లో కనకమహాలక్ష్మి కల్చరల్ అండ్ సోషల్ వెల్ఫేర్ వారి మేన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు
- 2007లో అనురాధ మెమోరియల్ సొసైటీ తరుపున గురుదేవోభవ లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంటు అవార్డు
- 2007లో గురుబ్రహ్మ అవార్డు
- 2008లో ఉగాది పురస్కారం

చదువుకు సాయం చేయడమే లక్ష్యం..



చదువులో ప్రతిభ చూపే పేద విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఆర్థిక కష్టాలు పడరాదనే అమ్మ సొసైటీ తరపున సేవలందేలా చూస్తున్నాను. సమాజసేవకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలి. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి. విద్య, వైద్యం కోసం పేదలకు సాయమం చేయాలి. అనాథ శవాల దహన సంస్కారాలకు చొరవచూపాలి. – అల్లం పురుషోత్తమరావు